# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

CELEBRATING 11TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 | సంచిక : 40 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శుక్రవారం 17 అక్టోబర్ 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


# బీఆర్ఎస్‌కు ఓటేస్తే మోరీలో వేసినట్లే!

## జూబ్లీహిల్స్‌లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయదు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

- మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్
- జూబ్లీహిల్స్ లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయదు
- దారుస్సలాం నిర్ణయించిన అభ్యర్థి నవీన్ యాదవ్
- ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి






**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే మోరీలో వేసినట్టేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గురువారం (అక్టోబర్ 16) జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని బోరబండ డివిజన్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మజ్లిస్ కనుసన్నల్లో పని చేస్తున్నాయని అన్నారు. మజ్లిస్ పార్టీకి అభివృద్ధి అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్ పారట్ఈ ఏం మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతోందని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు విపరీతంగా దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రెండేళ్ళుగా వీధిలైట్లు కూడా వేయలేని దుస్థితి లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా పోటీ చేసే ఎంఐఎం జూబ్లీహిల్స్ లో ఎందుకు పోటీ చేయడంలేదో చెప్పాలని అన్నారు. దారుస్సలాం నిర్ణయించిన అభ్యర్థి కే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలని, ఆ పార్టీ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఆ పార్టీ నుంచి ఇప్పటికే పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారని ఆరోపించారు. ఈరెండూ ఫిరాయింపులను ప్రోత్సాహించే పార్టీలేనని అన్నారు. కుటుంబాలు, పార్టీ లో ఉండే కుటుంబాల కోసమే పనిచేస్తాయని విమర్శించారు. ఎంఐఎం, బీఆర్ఎస్, కాంగ్రెస్ డీఎన్ఏ ఒక్కటేనని అన్నారు. బీఆర్ఎస్ కు ఓటేస్తే మోరీలో చేసినట్లేనని, ఒక్క ఎంపీ సీటు కూడా ఆ పార్టీ గెలవలేదని అన్నారు.

బీజేపీని గెలిపించుకునేందుకు వచ్చే నెల 11 వరకు అందరూ కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యకర్తల కోసం పూర్తి సమయంఇచ్చి పనిచేస్తున్న దీపక్ రెడ్డి ని గెలిపించుకోవాలని కోరారు. ఇందుకోసం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. సభలు సమావేశాలు నిర్వహించడమే కాదని, జూబ్లీహిల్స్ ను పరిరరక్షించుకోవాలని అన్నారు. స్థానికంగా ఉన్న కార్యకర్తలకు సాయం చేసేందుకే మేం ఇక్కడికి వస్తున్నామని అన్నారు. ఇక్కడ ధర్మం, న్యాయం, ప్రజలు గెలవాలని పని చేయాలని సూచించారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు పూర్తి సమయం ఇక్కడే ఉంటారన్నారు.

## మీడియా ముందుకు వెళ్లకండి.. కూర్చుని మాట్లాడుకుందాం

### కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్!

- ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు రావాలని మంత్రికి మీనాక్షి నటరాజన్ సూచన
- సిమెంట్ కంపెనీల యాజమాన్యాలను సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్ బెదిరించినట్లు ఆరోపణలు
- దీంతో ఓఎస్డీగా సుమంత్‌ను తప్పించిన ప్రభుత్వం

వివరాలు 2లో..



## రాయదుర్గంలో మరోసారి భూముల వేలం.. గజం రూ. 3,10,000...!



- నాలెడ్జ్ సిటీలోని 4,718.22 చదరపు గజాల వేలానికి టీజీఐఐసీ నోటిఫికేషన్
- నవంబర్ 11న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేలం
- ఇటీవల రాయదుర్గంలో రూ. 177 కోట్లు పలికిన ఎకరం భూమి

వివరాలు 2లో..

## బీసీ రిజర్వేషన్లు... సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురు

- స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత
- 50 శాతం పరిమితి దాటవద్దని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం
- పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లవచ్చని ప్రభుత్వానికి సూచన
- హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున జోక్యం చేసుకోలేమని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలన్న తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రిజర్వేషన్లు 50 శాతం పరిమితికి లోబడే ఉండాలని స్పష్టం చేసిన

వివరాలు 2లో..

## జూబ్లీహిల్స్ ఫేక్ ఓట్ల కేసు.. మేం జోక్యం చేసుకోలేం..

### ఎలాంటి ఆదేశాలనూ ఇవ్వలేం





- ఇప్పటికే జిల్లా ఎన్నికల ఆఫీసర్లు విచారిస్తుండ్రు
- మాగంటి సునీత, కేటీఆర్ పిటిషన్ పై వాదనలు
- విచారణ ముగించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం

**హైదరాబాద్ పెన్ పవర్:** జూబ్లీహిల్స్‌లో ఓట్ చోరీపై హైకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు

వివరాలు 2లో..

## పతి భారతీయుడి బాగు కోసం శ్రీశైలంలో ప్రార్థించాను



- శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ప్రధాని మోదీ
- దేశ ప్రజల శ్రేయస్సు కోసం ప్రత్యేక పూజలు చేసినట్టు వెల్లడి
- ప్రధాని వెంట సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- శ్రీ శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించిన ప్రధాని
- మల్లన్నను దర్శించుకున్న నాలుగో ప్రధానిగా నరేంద్ర మోదీ
- రూ.13,430 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో, మంచి ఆరోగ్యంతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ప్రధాని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం క్షేత్రానికి చేరుకున్న ప్రధాని మోదీకి ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం ప్రధాని వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటిగా విరాజిల్లుతున్న ఈ క్షేత్రం యొక్క విశిష్టతను, చారిత్రక ప్రాముఖ్యతను అర్చకులు ప్రధానికి వివరించారు. అనంతరం ప్రధాని తన పర్యటనకు సంబంధించిన ఫోటోలను 'ఎక్స్'

వివరాలు 2లో..

## గుజరాత్ రాజకీయాల్లో కీలక పరిణామం.. సీఎం తప్ప మంత్రులు మొత్తం రాజీనామా

- ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా తప్పుకున్న మంత్రులు
- నేడు మధ్యాహ్నం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ
- పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా రాజీనామా

వివరాలు 2లో..

ఛజగుజరాత్ రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ముఖ్యమం త్రి భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన మంత్రులందరూ తమ పదవులకు రాజీనామా చేశారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు మార్గం సుగమం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.




## నవంబర్ 14న కోర్టుకు రండి..

### దగ్గుబాటి హీరోలకు న్యాయస్థానం ఆదేశం

- హోటల్ కూల్చివేత కేసులో దగ్గుబాటి ఫ్యామిలీకి చిక్కులు
- వెంకటేశ్, రానా, సురేశ్ బాబు, అభిరామ్‌పై కేసు నమోదు
- నవంబర్ 14న వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం
- పర్సనల్ బాండ్ సమర్పించాలని సూచించిన నాంపల్లి కోర్టు
- కోర్టు ఆదేశాలను ధిక్కరించారన్న ఆరోపణలపై విచారణ

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రముఖ సినీ నటులు దగ్గుబాటి వెంకటేశ్, రానాలతో పాటు నిర్మాత సురేశ్ బాబు, అభిరామ్‌లకు నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఫిల్మ్‌నగర్‌లోని ఓ హోటల్ కూల్చివేతకు సంబంధించిన కేసులో

వివరాలు 2లో..




## కేంద్ర ప్రభుత్వ పథకాల పేరిట సైబర్ మోసాలు

### తెలంగాణ పోలీసుల హెచ్చరిక

- వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చే మెసేజ్‌లను చూసి మోసపోవద్దని హెచ్చరిక
- అర్హత చెక్ చేసుకోవాలంటూ పంపించే లింక్స్‌పై త్వరపడి క్లిక్ చేయవద్దని సూచన
- అపరిచితులు పంపించే లింక్స్, మెసేజ్‌లకు స్పందించవద్దన్న తెలంగాణ పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వ పథకాల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్ గ్రూపులలో వచ్చే సందేశాలను చూసి మోసపోవద్దని, అర్హత కోసం

వివరాలు 2లో..



## తెలంగాణ అడవుల్లో సినిమా షూటింగ్‌లు.. 24 గంటల్లోనే అనుమతులు



- తెలంగాణలో సినిమా షూటింగ్‌లకు అటవీ ప్రాంతాల్లో అనుమతి
- సుమారు 70 లొకేషన్లను గుర్తించిన అటవీ శాఖ అధికారులు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు.. కేవలం 24 గంటల్లోనే పర్మిషన్లు
- 'ఫిలిమ్స్ ఇన్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక సింగిల్ విండో వెబ్‌సైట్ం
- రోజుకు రూ.50 వేల ఫీజుతో చిత్రీకరణకు అవకాశం
- సినీ, పర్యాటక రంగాలకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యం

వివరాలు 2లో..

## యుద్ధానికి ముందే సేనాని పారిపోయాడు

### ప్రశాంత్ కిశోర్ పై బీజేపీ సెటైర్లు



- బీహార్ ఎన్నికల బరి నుంచి తప్పుకున్న ప్రశాంత్ కిశోర్
- సేనాని పారిపోయాడు... సైన్యం పరిస్థితి ఏమిటన్న అనురాగ్ ఠాకూర్
- పీకే తెలివైన వ్యాపారవేత్త అన్న పూనావాలా

**పెన్ పవర్ డెస్క్:**బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ (పీకే) ప్రకటించడం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# పవన్... స్వపక్షంలో విపక్షం

పవన్ కల్యాణ్.. హీరోగా..ఓ పొలిటీషియన్‌గా ఈ పేరే ఓ బ్రాండ్. పార్టీ పెట్టి పదేళ్లు పోరాడిన పవన్..అప్పట్లో వైసీపీ ప్రభుత్వ తీరుపై ఓ రేంజ్‌లో మండిపడేవారు. ఎప్పటికప్పుడు సమస్యలను ఎక్స్‌పోజ్ చేస్తూ..ప్రశ్నించే గళంగా ప్రజల మన్ననలను పొందారు పవర్ స్టార్. ఇప్పుడాయన ఫ్యూర్ పొలిటిషయన్. అయినా సరే తానేం మారలేదంటున్నారు పవన్. ఎప్పుడూ ప్రజల పక్షామే..జనం సమస్యే తన ఎజెండా అన్నట్లుగా కూటమి ప్రభుత్వంలో అపోజిషన్ పాత్ర పోషిస్తున్నారుఏ చిన్న అంశమైన విపక్ష వైసీపీ కంటే పవన్ స్పందిస్తున్నారు. ఉపముఖ్యమంత్రి హోదాలో ఎక్కడికి వెళ్లినా ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పవన్..వాటి పరిష్కారంపై స్పెషల్ కాన్సంట్రేషన్ పెడుతున్నారు. లేటెస్ట్‌గా కాకినాడ జిల్లాలో సముద్ర కాలుష్యంపై క్షేత్రస్థాయి పర్యటన చేసిన పవన్..పీసీబీ అధికారులతో సమీక్షించి కాలుష్యం నివారణకు పకడ్బందీ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. ఉప్పాడ మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు టైమ్ బాండ్ ఫిక్స్ చేసుకున్నారు. సమస్యలను పరిష్కరించలేని నాడు రాజకీయాల నుంచి తప్పుకుంటానంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చి చర్చకు దారి తీశారు.ఇక మంత్రివర్గ సమావేశంలో లులు గ్రూప్ విషయంలో ఏకంగా ప్రశ్నల వర్షమే కురిపించారు పవన్. లులు గ్రూప్ పెట్టే కండిషన్లతో ఏపీకి వచ్చే పెట్టుబడులు ఎన్ని.? ఇచ్చే ఉపాధి ఎంత అనే అంశాలపై ఆయన అధికారులను ప్రశ్నిలు వేస్తూ ఉక్కిరి బిక్కిరి చేసేశారట. ఎంతో విలువైన భూముల ఇస్తే ఆ పరిశ్రమలు ద్వారా స్థానికులకు వచ్చే లబ్ది ఎంత అనేదానిపై పవన్ వాయిస్ రేజ్ చేశారట. ఇక ఉచిత పథకాలు ఎవరికి.? ఎందుకు? అనే కోణంలో పవన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి.ఏపీలో యువత ఉచితాలు, సంక్షేమ పథకాలు అడగడం లేదు..25 సంవత్సరాల భవితను కోరుకుంటున్నారని పవన్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అయితే రాష్ట్ర సర్కారులో కీలక భాగస్వామిగా ఉన్న పవన్..ఉచిత పథకాలు ఎవరూ కోరుకోవడం లేదని చెప్పడం విమర్శలకు దారితీసింది. అయితే తన అభిప్రాయాన్ని ఓపెన్‌గా చెప్పేయడం పవన్ నైజం. అధికారంలోకి వచ్చిన కొత్తలో కాకినాడ రేషన్ బియ్యం ఇష్యూలో సీజ్ ది షిప్ అని అందరి దృష్టిని ఆకర్షించారు.పవన్ వ్యాఖ్యలు కూటమిలో అసంతృప్తి రాగం అన్నట్లుగానే బయటికి కనిపిస్తున్నాయి. కానీ పవన్ కల్యాణ్ రూటెప్పుడు సెపరేటు. ఆయనకు వామపక్ష భావజాలం అంటే ఇష్టం. చేగువేరా సిద్ధాంతాలను తన ప్రసంగాల్లో ప్రస్తావిస్తూ..నిత్యం ప్రశ్నించే గళంగా ఉండేందుకు ఇష్టం పడతారు. ఇప్పుడు అధికారంలో ఉన్నా..కొన్ని విషయాల్లో ప్రజా కోణంలో..ఓపెన్‌గానే తన అభిప్రాయాన్ని చెప్పేస్తున్నారు. సేనాని కామెంట్స్‌ను వైసీపీ అస్త్రంగా మల్చుకునే ప్రయత్నం చేస్తోంది. అధికారంలో ఉండి..పైగా కూటమిలో భాగస్వామిగా కొనసాగుతూ..పవన్ ఫ్యూచర్ బేస్డ్‌గానే వాయిస్ రేజ్ చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. రేపటి రోజున ఏదైనా ఇష్యూపై చర్చ జరిగినప్పుడు తాను అప్పుడే వ్యతిరేకించానని చెప్పుకునేందుకు..పైగా ప్రభుత్వంలో ఉన్నా తాను మౌనంగా లేనని చెప్పేందుకే ఎప్పటికప్పుడు తన ఒపీనియస్ వ్యక్తం చేస్తున్నారట.ప్రభుత్వాన్ని మేలుకొలిపేలా..పవన్ తన అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారనే చర్చకు జరుగుతోంది. ప్రభుత్వం తరపున బాధ్యతాయుతమైన నాయకుడిగా.. డిప్యూటీ సీఎం హోదాలోనే రెస్పాండ్ అవుతున్నారే తప్ప..కూటమిలో అసంతృప్తి అనో..మరో రకంగానే డైవర్ట్ చేయాల్సిన అవసరం లేదంటున్నాయి జనసేన వర్గాలు. ఏదేమైనా పవన్ ప్రశ్నించే గళంగానే ఉంటుండటం ఆసక్తిరేపుతోంది.

# తెలంగాణ అడవుల్లో సినిమా షూటింగ్‌లు.. 24 గంటల్లోనే అనుమతులు

తెలంగాణలో సినీ పరిశ్రమకు, పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలోని పలు అటవీ ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌లకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెడుతూ, దరఖాస్తు చేసుకున్న కేవలం 24 గంటల్లోనే అనుమతులు మంజూరు చేసేలా చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయం సినీ నిర్మాతలకు సమయం, ఖర్చు రెండింటినీ ఆదా చేయనుంది.

**'ఫిలిమ్స్ ఇన్ తెలంగాణ' పేరిట ప్రత్యేక వెబ్‌సైట్**

ఈ నూతన విధానంలో భాగంగా 'ఫిలిమ్స్ ఇన్ తెలంగాణ' పేరుతో ప్రభుత్వం ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. షూటింగ్‌లకు అవసరమైన అన్ని అనుమతులను ఈ పోర్టల్ ద్వారానే పొందవచ్చు. అటవీ ప్రాంతాల్లో చిత్రీకరణ కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 24 గంటల్లోనే అనుమతి లభిస్తుంది. ఒకవేళ ఏవైనా సాంకేతిక కారణాలతో ఆలస్యమైనా, ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం షూటింగ్ జరుపుకోవడానికి వెసులుబాటు కల్పించడం విశేషం.

**సుమారు 70 లొకేషన్ల గుర్తింపు**

అటవీ శాఖ అధికారులు సినీ పరిశ్రమ వర్గాలతో చర్చించి, షూటింగ్‌లకు అనువుగా ఉండే సుమారు 70 ప్రాంతాలను గుర్తించారు. వీటిలో వికారాబాద్, అమ్రాబాద్, నర్సాపూర్, వరంగల్, ఆదిలాబాద్‌లోని దట్టమైన అడవులతో పాటు హైదరాబాద్ శివార్లలోని 52 అర్బన్ ఫారెస్ట్ పార్కులు కూడా ఉన్నాయి. నారపల్లి నందనవనంలోని జింకల పార్కు, చిలుకూరు ఫారెస్ట్ ట్రెక్, కండ్లకోయ ఆక్సిజన్ పార్కు వంటివి ఈ జాబితాలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ లొకేషన్లలో చిత్రీకరణకు రోజుకు రూ.50 వేల రుసుమును ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు (ఎఫ్‌డీసీ) ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది.

గతంలో 'ఆర్ఆర్ఆర్' వంటి భారీ చిత్రంలోని కొన్ని కీలక సన్నివేశాలను వికారాబాద్ అడవుల్లో చిత్రీకరించారు. ఇప్పుడు హైదరాబాద్‌కు 60 నుంచి 100 కిలోమీటర్ల పరిధిలోనే అనేక సుందరమైన లొకేషన్లు అందుబాటులోకి రావడంతో చిత్ర పరిశ్రమకు ఇది ఎంతో ప్రయోజనకరంగా మారింది. ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి చార్మినార్ సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్‌ను నోడల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది.

# పతి భారతీయుడి బాగు కోసం శ్రీశైలంలో ప్రార్థించాను

- మొదటి పేజి తరువాయి

ఖాతాలో పంచుకున్నారు.ఈ పర్యటనతో శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న నాలుగో భారత ప్రధానిగా నరేంద్ర మోదీ నిలిచారు. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు ఈ ఆలయాన్ని సందర్శించారు. ప్రధానిగా మోదీ శ్రీశైలానికి రావడం ఇదే తొలిసారి.ఆలయ దర్శనం తర్వాత ప్రధాని మోదీ శ్రీశైలంలో ఉన్న శ్రీ శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. 1677లో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఈ క్షేత్రాన్ని సందర్శించిన దానికి గుర్తుగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి ధ్యాన మందిరాన్ని, శివాజీ విగ్రహాన్ని ప్రధాని పరిశీలించారు. కేంద్రం నిర్వాహకులు దాని ప్రాముఖ్యతను మోదీకి వివరించారు.

అంతకుముందు కర్నూలు విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానికి గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ రాష్ట్రంలో పరిశ్రమలు, విద్యుత్,

రోడ్లు, రైల్వేలు, రక్షణ, పెట్రోలియం వంటి పలు రంగాలకు చెందిన సుమారు రూ.13,430 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. నన్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జీఎస్టీ సంస్కరణలపై జరిగే బహిరంగ సభలో కూడా ఆయన ప్రసంగించనున్నారు.

# మీడియా ముందుకు వెళ్లకండి.. కూర్చుని మాట్లాడుకుందాం

"మీడియా ముందుకు వెళ్లవద్దు. కూర్చుని మాట్లాడుకుందాం" అని తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్ చేసి సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు రావాలని మంత్రికి నటరాజన్ సూచించారు.

**ఏం జరిగింది?**

కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సిమెంట్ కంపెనీల యాజమాన్యాలను ఆయన బెదిరించినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ఆయనపై చర్యలు తీసుకున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని కొండా సురేఖ ఇంటికి పోలీసులు వెళ్లారు. మాజీ ఓఎస్డీ సుమంత్ ఉన్నారనే సమాచారంతో మఫ్టీలో ఉన్న పోలీసులు అక్కడకి చేరుకున్నారు. అయితే, కొండా సురేఖ కుమార్తె సుష్మిత పోలీసులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా సుష్మిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఇవన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. తన తల్లిదండ్రులనే లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖతో నటరాజన్ మాట్లాడినట్లు సమాచారం.

# బీసీ రిజర్వేషన్లు... సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురు

- మొదటి పేజి తరువాయి

సర్వోన్నత న్యాయస్థానం, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టివేసింది. అవసరమైతే పాత రిజర్వేషన్ల విధానంతోనే ఎన్నికలు నిర్వహించుకోవచ్చని ప్రభుత్వానికి సూచించింది.వివరాల్లోకి వెళితే, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 9పై హైకోర్టు గతంలో స్టే విధించింది. ఈ స్టేను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే నిర్వహించి, శాస్త్రీయంగానే రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించామని, దీనిపై అసెంబ్లీలో కూడా అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని కోర్టుకు వివరించారు.అయితే, రిజర్వేషన్లు 50 శాతం మించరాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన కృష్ణమూర్తి తీర్పు స్పష్టంగా చెబుతోందని ప్రతివాదుల తరఫు న్యాయవాది బలంగా వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ అంశంపై ఇప్పటికే హైకోర్టులో విచారణ కొనసాగుతున్నందున తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఈ దశలో పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేమని పేర్కొంటూ కొట్టివేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా ఈ కేసులో విచారణను కొనసాగించాలని హైకోర్టుకు సూచించింది.సుప్రీంకోర్టు తాజా తీర్పుతో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మళ్లీ ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. త్వరలో జరగనున్న కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# జూబ్లీహిల్స్ ఫేక్ ఓట్ల కేసు.. మేం జోక్యం చేసుకోలేం..

- మొదటి పేజి తరువాయి

ఈ సమయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చింది. అదే క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రత్యేకంగా ఆదేశాలు కూడా ఇవ్వలేమని తెలిపింది. బోగస్ ఓట్లు తొలగించాలంటూ జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్ పై సీజే అపరేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.

జూబ్లీహిల్స్‌తో సంబంధం లేనివారు ఓటర్ జాబితాలో చేరారని బీఆర్ఎస్ తరఫున న్యాయవాది దామా శేషాద్రినాయుడు తన వాదనలు వినిపించారు. జూబ్లీహిల్స్‌లో 19వందలకు పైగా బోగస్ ఓట్లు ఉన్నాయని బెంచ్ కు తెలిపారు. 12 వేల మంది బయటి వ్యక్తులకు ఓట్లు ఉన్నాయన్నారు. కొంతమందికి రెండు ఓట్లు కూడా ఉన్నాయని వివరించారు. పిటీషనర్లు చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారికి ఫిర్యాదు చేశారని ఎలక్షన్ కమిషన్ తరపు న్యాయవాది అవినాష్ కోర్టుకు తెలిపారు.

ఓటర్ల నమోదు అనేది నిరంతర ప్రక్రియని, 21వ తేదీ వరకు పరిశీలన చేస్తారని వాదనలు వినిపించారు. ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారిని సైతం వివరణ అడిగినట్లు ఈసీ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు.

ఇరు పక్షాల వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం ఈ పిటిషన్‌లో ప్రత్యేక ఆదేశాలు ఏమీ ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపింది. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నందన ప్రత్యేకంగా ఆదేశాలు ఇవ్వలేమని పేర్కొన్నది. ఈ కేసు విచారణను ముగిస్తున్నట్టు తెలిపింది.

# కేంద్ర ప్రభుత్వ పథకాల పేరిట సైబర్ మోసాలు

- మొదటి పేజి తరువాయి

లింక్స్‌లపై క్లిక్ చేసి మీ వ్యక్తిగత వివరాలను నమోదు చేయవద్దని సూచించారు. ప్రభుత్వ పథకాల కోసం అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వాట్సాప్ గ్రూపులలో సైబర్ నేరగాళ్లు ఫేక్ లింక్స్‌లను పంపి, కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుబాటులో ఉన్నాయని నమ్మబలుకుతారని పేర్కొన్నారు. అర్హతను పరిశీలించుకోవాలని ఆశ చూపుతూ లింక్‌లను పంపుతారని, వాటిపై తొందరపడి క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. అపరిచితులు పంపించే లింక్స్, సందేశాలకు స్పందించవద్దని సూచించారు.

# రాయదుర్గంలో మరోసారి భూముల వేలం.. గజం రూ. 3,10,000...!

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భూముల వేలానికి మరోసారి సిద్ధమైంది. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, రాయదుర్గం పరిధిలోని నాలెడ్జ్ సిటీలో 4,718.22 చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని వేలం వేయడానికి టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. గజానికి రూ. 3,10,000 రిజర్వ్ ధరను నిర్ణయించినట్లు టీజీఐఐసీ పేర్కొంది. ఈ భూమికి సంబంధిచిన ఈ-వేలం నవంబర్ 11న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు టీజీఐఐసీ కార్యాలయంలో జరుగుతుందని తెలిపింది.ఇటీవల రాయదుర్గంలో టీజీఐఐసీ 18.67 ఎకరాలను వేలానికి పెట్టింది. తొలి విడతలో 7.67 ఎకరాలను వేలం వేయగా, ఎకరం భూమి రూ. 177 కోట్లు పలికింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన భూముల వేలంలో ఇది అత్యధిక ధర. 7.67 ఎకరాల భూమిని రూ. 177 కోట్ల చొప్పున రూ. 1,356 కోట్లకు ఎంఎస్ఎం రియాల్టీ సంస్థ దక్కించుకుంది. ఈసారి గజానికి రూ. 3,10,000 అంటే ఎకరాకు రూ. 124 కోట్లుగా వస్తుంది.

## గుజరాత్ రాజకీయాల్లో కీలక పరిణామం.. సీఎం తప్ప మంత్రులు మొత్తం రాజీనామా

- మొదటి పేజి తరువాయి

శుక్రవారం మధ్యాహ్నం 12:39 గంటలకు నూతన మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయనుంది. "ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తన మంత్రివర్గాన్ని శుక్రవారం మధ్యాహ్నం విస్తరించనున్నారు" అని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.మంత్రివర్గంలో దాదాపు 10 మంది కొత్త వారికి అవకాశం లభించవచ్చని బీజేపీకి చెందిన ఒక సీనియర్ నాయకుడు తెలిపారు. అంతేకాకుండా, ప్రస్తుత ఉన్న మంత్రుల్లో దాదాపు సగం మందిని మార్చే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం గుజరాత్ మంత్రివర్గంలో ముఖ్యమంత్రితో సహా మొత్తం 17 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో ఎనిమిది మంది క్యాబినెట్ ర్యాంకు మంత్రులు కాగా, మిగిలిన వారు సహాయ మంత్రులుగా కొనసాగుతున్నారు.

# యుద్ధానికి ముందే సేనాని పారిపోయాడు

- మొదటి పేజి తరువాయి

ఈ నిర్ణయంపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఘాటుగా స్పందించారు. "యుద్ధం ప్రారంభం కాకముందే సేనాని పారిపోయాడు. ఇక సైన్యం పరిస్థితి ఏంటి?" అంటూ ఆయన పీకేను ఉద్దేశించి ఎద్దేవా చేశారు.బీజేపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు పాట్నా చేరుకున్న అనురాగ్ ఠాకూర్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పీకే నిర్ణయం, ఆయన పార్టీ భవిష్యత్తుపై తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు.అంతకుముందు రోజు, తాను ఎన్నికల బరిలో నిలబడటం లేదని ప్రశాంత్ కిషోర్ ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత పనులపైనే పూర్తిగా దృష్టి సారించాలని జన్ సూరజ్ నిర్ణయించిందని, అందుకే తాను పోటీకి దూరంగా ఉంటున్నానని ఆయన తెలిపారు. ఇదే సమయంలో, బీహార్‌లో అధికార ఎన్డీయే ఓటమి ఖాయమని పీకే జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ తిరిగి రాలేరని, ఆయన నేతృత్వంలోని జేడీయూ 25 సీట్లు గెలవడం కూడా కష్టమేనని అన్నారు. తమ పార్టీకి 150 సీట్ల కంటే తక్కువ వస్తే అది ఓటమి కిందే లెక్క అని ఆయన పేర్కొన్నారు.పీకే నిర్ణయంపై బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా కూడా విమర్శలు గుప్పించారు. "ప్రశాంత్ కిషోర్ ఒక తెలివైన వ్యాపారవేత్త, ఎన్నికల ప్రచారకర్త. క్షేత్రస్థాయిలో పరిస్థితి అనుకూలంగా లేదని ఆయనకు అర్థమైంది. ఈ ఎన్నికల్లో ఓడిపోతే భవిష్యత్తులో తన వ్యాపారానికి గిరాకీ ఉండదనే భయంతోనే పోటీ నుంచి తప్పుకున్నారు" అని పూనావాలా ఆరోపించారు.

ఇదే సందర్భంలో, బీజేపీ ప్రకటించిన 101 మంది అభ్యర్థుల్లో ఒక్క ముస్లిం కూడా లేకపోవడంపై అడిగిన ప్రశ్నకు అనురాగ్ ఠాకూర్ బదులిచ్చారు. "మేము గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తాం. మతం, కులం ఆధారంగా ప్రజలకు సౌకర్యాలు కల్పించం. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్‌కే మా ప్రాధాన్యత" అని ఆయన వివరించారు.కాగా, బీహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు.

## నవంబర్ 14న కోర్టుకు రండి..

- మొదటి పేజి తరువాయి

నలుగురూ నవంబర్ 14న కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని స్పష్టం చేసింది. ఆ రోజు కోర్టుకు వచ్చి పర్సనల్ బాండ్ సమర్పించాలని ఆదేశించింది.వివరాల్లోకి వెళితే, ఫిల్మ్‌నగర్‌లోని దక్కన్ కిచెన్ హోటల్‌ను కోర్టు ఆదేశాలను ధిక్కరించి కూల్చివేశారనే ఆరోపణలపై దగ్గుబాటి వెంకటేశ్, రానా, సురేశ్ బాబు, అభిరామ్‌లపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి గురువారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణ సందర్భంగా న్యాయస్థానం పై విధంగా ఆదేశాలు ఇచ్చింది.గతంలో ఇచ్చిన కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఈ కూల్చివేత జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నమోదైన కేసు విచారణలో భాగంగా దగ్గుబాటి కుటుంబ సభ్యులు కోర్టుకు హాజరు కావడం తప్పనిసరి అని న్యాయస్థానం పేర్కొంది.

# ప్రధాన మంత్రి రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ నల్లజెండాలతో మజ్జివల్సలో నిరసన

- గిరిజన మంత్రి,జిల్లాకలేకర్ ఆదేశాలను ఏమాత్రం విశ్వసించని గిరిజనులు.
- చలో కలక్టరేట్ విజయవంతం చేయాలని గిరిజన సంఘం పోరాట కమిటీ పిలుపు
- శాంతియుత చలో కార్యక్రమాన్ని అధికారులు అశాంతిని కలగజేయకండి.!
- పోరాట కమిటీ నాయకులు క్రిష్ణ రావు.



**పెన్ పవర్ హుకుంపేట అక్టోబర్ 16:**హుకుంపేట మండలం మజ్జివలస, తుంబవలస గ్రామాలలో నల్లజెండాలు బెడ్జిలతో బారి నిరసన ప్రదర్శన, గిరిజన సంఘం కార్యదర్శి,పోరాట కమిటీ నాయకులు టి క్రిష్ణరావు,కన్వీనర్ కృష్ణం రాజు ఆధ్వర్యంలో చేపట్టడమైనదని వారు పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి రాష్ట్ర పర్యటనలో బాగంగా, ఆదివాసి గిరిజన సంఘం,మరియు హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపు మేరకు నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు నిరసిస్తూ ఈ నిరసన ప్రదర్శన జరుగుతుందని అన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్ర పర్యావరణ అనుమతులు వెనక్కి తీసుకోవాలని,ఏకపక్షంగా ప్రభుత్వం విడుదల చేసిన 51,13,2 జీఓ లను రద్దు చేయాలని,ఈ నిరసన యొక్క ప్రధాన ఉద్దేశమని అన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టును వెతిరేకిస్తూ ఆదివాసులు చేపడుతున్న ఆందోళనాలను.దృష్టిలో ఉంచుకొని గిరిజన మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ దినేష్ కుమార్ గార్లు హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిపివేస్తున్నట్టు, ఆదివాసులు ఆందోళన చెందనక్కర లేదని చేసిన ఆదేశాలను ప్రభావిత ప్రాంత ప్రజలు మరియు పోరాట కమిటీ నాయకులు ఏమాత్రం విశ్వసనీయత చూపటం లేదన్నారు.

వారు జీఓ నెంబర్ 2, 13,51రద్దు చేయడం గూర్చి మాట్లాడ లేదన్నారు.

జీఓ లు రద్దుచేసి శాశ్వతంగా హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం ఆపేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారన్నారు.

మంత్రిగారూ, కలక్టర్ ప్రాజెక్టు తాత్కాలిక నిలుపుదల కోసమే మాట్లాడు తున్నరానీ అన్నారు.

ఇది ఆదివాసులకు మోసం చేయడమే అన్నారు.

జీఓలు రద్దు చేయకపోతే ఉద్యమాలు ఆపే ప్రసక్తే లేదన్నారు.

రేపు ఛలో కలక్టరేట్ కార్యక్రమం విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఆదివాసులు,పవర్ ప్రాజెక్టు ప్రభావిత ప్రజలు చేసే, శాంతియుత చలో కార్యక్రమాన్ని అశాంతిని కలుగ జేయవద్దని పోలీసులకు,అధికారులకు ఆదివాసీ గిరిజన సంఘం పోరాట కమిటీ విజ్ఞప్తి చేస్తుందన్నారు ఈ కార్యక్రమానికి పోరాట కమిటీ నాయకులు కన్వీనర్ సురేష్ కుమార్ కృష్ణం రాజు ఎంపీటీసీ హరిబాబు పోరాట కమిటీ సభ్యులు నాయకులు మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## డీఎస్సీ నియామకాల్లో గిరిజనులకు భారీ అన్యాయం- మౌనంగా ఉన్న నాయకులపై ఆవేదన

- గిరి జనజాగృతి సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షులు ముర్ల వెంకట రమణ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,అక్టోబర్ 16:** డీఎస్సీ నియామకాల్లో జీవో నెంబర్ 3 అమలు కాకపోవడంతో సుమారు 2 వేలమంది గిరిజన నిరుద్యోగులు ఉద్యోగావకాశాలు కోల్పోయారు. దీనివల్ల వేలాది గిరిజన కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయని గిరి జనజాగృతి సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. “రెండువేల ఉద్యోగాలు కోల్పోవడం అంటే, రెండువేల గిరిజన కుటుంబాలు నెలకు దాదాపు పదికోట్ల రూపాయల ఆదాయం కోల్పోవడం. ఇది కేవలం ఉద్యోగం కోల్పోవడమే కాదు ు ఒక సమాజం వెనక్కి వెళ్లిపోవడమే” అని ఆయన అన్నారు.ఉద్యోగం ఉంటే కుటుంబానికి%ొ% సమాజానికి లాభం,ఒక వ్యక్తికి ఉద్యోగం ఉంటే ఆ కుటుంబానికి నెలవారీ స్థిరమైన ఆదాయం లభిస్తుంది.ఆ ఆదాయం ద్వారా ఆహారం, బట్టలు, గృహం, పిల్లల విద్య, వైద్యం వంటి అవసరాలు తీరతాయి.ఉద్యోగులు పన్నులు చెల్లించడం ద్వారా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతుంది. కుటుంబ స్థిరత్వం, పిల్లల భవిష్యత్తుపై విశ్వాసం పెరుగుతుంది. అలాగే ఉద్యోగం లేకుంటే వచ్చే సమస్యలు అనేకం.కుటుంబ ఆదాయం ఆగిపోతుంది. అప్పులు, విద్యా ఖర్చులు భారమవుతాయి.ఆందోళన, మానసిక ఒత్తిడి, కుటుంబ కలహాలు పెరుగుతాయి.చిన్న వ్యాపారాలు కూడా దెబ్బతింటాయి. పేదరికం, నిరాశ, నేరాలు పెరిగే ప్రమాదం ఉంటుంది అన్నారు.ముర్ల వెంకటరమణ మాట్లాడుతూ, “ఇంత పెద్ద నష్టం జరిగినా ఆదివాసీ రాజకీయ నాయకులు, ఉద్యోగ సంఘాలు మౌనంగా ఉండటం బాధాకరం. ఎన్నికల సమయంలో అభివృద్ధి హామీలు ఇచ్చిన వారు ఇప్పుడు స్పందించడం లేదు. ఇలాంటి సమయంలోనే నాయకత్వం అవసరం” అని అన్నారు.

నాయకులకు పిలుపు:

“మా పక్షాన చట్టసభల్లో మీరు మాట్లాడకపోతే ు మా గోడు ఎవరు వినిపిస్తారు? మీరు మౌనంగా ఉంటే మాకు దిక్కెవరు? దయచేసి మౌనం విడిచి గిరిజన సమాజం కోసం బహిరంగంగా మాట్లాడండి” అని ఆయన పిలుపునిచ్చారు.

## సీలేరు ఎస్ఐగా ఎండి యాసిన్ బాధ్యతలు స్వీకరణ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 16:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్‌కి ఎండి యాసిన్ కొత్త సబ్ ఇన్స్పెక్టర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఎండి యాసిన్ ఇంతకు ముందు శ్రీకాకుళం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. అనంతరం బదిలీపై అల్లూరి సీతారామరాజు జిల్లాకు వచ్చారు.ఈ మేరకు అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్ ఆదేశాల మేరకు యాసిన్ ను సీలేరు ఎస్ఐగా నియమిస్తూ, ఇక్కడ పనిచేసిన పూర్వ ఎస్ఐను అల్లూరి జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కి బదిలీ చేశారు.

# వర్ధంతి సందర్భంగా వినూత్న రీతిలో మొక్కల పంపిణీ




**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ :16 :** తల్లి జ్ఞాపకార్థం మొక్కను పెంచండి, పర్యావరణాన్ని కాపాడండి అంటూ తన తల్లి జ్ఞాపకార్థం పలువురికి భోజనాలు ఏర్పాటు చేసి, మొక్కలు అందజేసి, తల్లి రుణం తీర్చుకున్నారు కొయ్యూరు గ్రామనికి చెందిన అనిశెట్టి చిరంజీవి బ్రదర్స్ కొయ్యూరు గ్రామానికి చెందిన అనిశెట్టి సత్యవతి ప్రధమ వర్ధంతి సందర్భంగా తన కుమారులు సీనియర్ టిడిపి నాయకులు అనిశెట్టి వీర వెంకట సత్యనారాయణ (వీరబాబు), చిరంజీవి, నాగేశ్వరరావు (నాగబాబు)లు గురువారం పలువురికి భోజనాలు ఏర్పాటు చేసి, వినూత్న రీతిలో పూల మొక్కలు పంపిణీ చేసి తల్లి రుణం తీర్చుకున్నారు. తల్లి రుణంతోపాటు పదిమందికి మేలు కలగాలన్న వారి సంకల్పాన్ని పలువురు అభినందించారు. అలాగే,తమ తల్లి ఆత్మకు శాంతి కలగాలని పలువురు ఆకాంక్షించారు. అనిశెట్టి సత్యవతి ఈనెల 6వ తేదీ సోమవారం కాలం చేశారు. 9వ రోజు గురువారం ప్రధమ వర్ధంతి కార్యక్రమం కొయ్యూరు గ్రామంలో నిర్వహించారు. .ఈ సందర్భంగా పలువురికి భోజనాలు ఏర్పాటు చేసి, జ్ఞాపకార్థం పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షులు కాకూరి చంద్రరావు, గాడి సత్యనారాయణ, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు,కుటుంబ సభ్యులు అనిశెట్టి సత్యనారాయణ, సత్తిబాబు, రామకృష్ణ, మల్లిక, గణేష్, ప్రియాంక, గుడివాడ సత్యనారాయణ, గ్రామస్తులు సర్పంచ్ మా కాడ బాలరాజు,మొట్టడం రాజశేఖర్, మా కాడ బూరుగులయ్య, లోతా భీమరాజు, ఉబ్బల రాజేష్, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## సాండికోరి గ్రామంలో మంచినీటి కోసం కటకట





- నాలుగు రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి
- మరమ్మతులకు గురైన కరెంటు మోటారు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 16:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని సాండికోరి గ్రామంలో గత నాలుగు రోజులుగా గ్రామస్తులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ఒకే చేతిపంపు పనిచేస్తున్నా, బోరు నుండి సరైన నీరు రాకపోవడంతో పాటు మలినాలు వస్తున్నాయి అని స్థానికులు తెలిపారు. మరొక చేతిపంపు పూర్తిగా పనిచేయడం లేదని, అలాగే కరెంటు మోటారు కూడా చెడిపోయి మరమ్మతులు అవసరమవుతున్నాయని వారు వాపోయారు.ఎండాకాలం రాకముందే నీటి సమస్య తలెత్తడంతో గ్రామ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. “తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని బోర్లు, మోటార్లను మరమ్మతులు చేయించి నీటి ఎద్దడిని తీర్చాలి” అని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

# గ్రామాలలో ప్రతి అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తా..!



**ఏ ఎం సి డైరెక్టర్ కోటేశ్వరరావు పడాల్**

**పెన్ పవర్ హుకుంపేట అక్టోబర్ 16:**అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు నియోజకవర్గం, హుకుంపేట మండలం చీకుమదుల పంచాయతీ, పెదనందిపుట్టు గ్రామంలో జనసేన పార్టీ చీకుమదుల పంచాయతీ ఇంచార్జ్ కొర్ర రాజారావు, గెమ్మెలి కొండబాబు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసారు సమావేశంలో స్థానిక సమస్యలు తెలుసుకోవడానికి హుకుంపేట మండల జనసేన పార్టీ అధ్యక్షులు%ం%ఏ ఎం సి డైరెక్టర్ బలిజ కోటేశ్వరరావు పడాల్ గ్రామానికి సందర్శిచారు గ్రామంలోని ప్రధాన సమస్యలు చీకుమదుల నుంచి పాడేరు చేరుకోవడానికి రోడ్డు సదుపాయం లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్తులు దరఖాస్తు రూపంలో తెలియజేసారు. తప్పకుండ కూటమి ప్రభుత్వం దృష్టిలో పెడతామని, అలాగే జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేస్తామని హామీ ఇచ్చారు మరియు రంగరాజు పల్లి గ్రామంలో విద్యుత్ స్థంబాలు శిదిలా వ్యవస్థకు చేరుకొని గ్రామంలో ప్రమాదానికి పొంచి ఉందని ఈవిషయం విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని వెంటనే సిమెంట్ స్థంబాలు ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని గ్రామస్థులకు హామీ ఇవ్వడం ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బూడిద నాగరాజు, కార్యదర్శి శరభ ప్రసాద్ పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం...!



**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 16 :** మండలంలోనిమర్రిపాలెంప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో గురువారం మర్రిపాలెం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో “ప్రపంచ ఆహార దినోత్సవం” ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ కె. సుధ మాట్లాడుతూ...ఆహారాన్ని వృధా చేయరాదు, మితంగా ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. వృక్షశాస్త్ర అధ్యాపకులు బి. కుమారి మాట్లాడుతూ...ఆహార దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వికెటి మహాలక్ష్మీ, మాట్లాడుతూ ఆహారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమం లో అధ్యాపకులు, మరియు అధ్యాపకేతర సిబ్బంది,మరియు విద్యార్థినులు, పాల్గొన్నారు.

## విశాఖ పశ్చిమలో అభివృద్ధి పనులపై సమీక్ష

**అధికారులకు ఎమ్మెల్యే గణబాబు స్పష్టమైన దిశానిర్దేశం**





**గోపాలపట్నం, పెన్ పవర్, అక్టోబర్ 16 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షిస్తూ, ఈ రోజు గోపాలపట్నంలోని నియోజకవర్గ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో జీవీఎంసీ జోన్-6, జోన్-8 అధికారులతో కలిసి జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా వార్డ్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న డ్రెయిన్ నిర్మాణం, సీసీ రోడ్లు, బీట్ రోడ్‌లు, యుజిడి లైన్లు, వాటర్ సప్లై పనులు, ఎలక్ట్రిక్ పనులు వంటి మౌలిక వసతుల పనుల పురోగతిపై సమగ్ర చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ప్రతి పనిని వేగంగా పూర్తి చేసి, ప్రజలకు గడిచిన కాలంలో తలెత్తిన అసౌకర్యాలు ఇకపై లేకుండా చూడాలని, అధికారులు సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం సాధ్యమే” అని స్పష్టం చేశారు.

**గోపాలపట్నం జడ్పీహెచ్ స్కూల్ గ్రౌండ్ అభివృద్ధి పనులు..**

ఈ గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్ నిర్మాణం, క్రీడా మైదానం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నెలలో రాష్ట్రస్థాయి గేమ్స్, 5కె రన్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. “గ్రౌండ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. విశాఖ పేరు రాష్ట్రవ్యాప్తంగా వినిపించేలా ఈ ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో జోన్ 8 జోనల్ కమిషనర్ శంకరరావు, జోన్ 5 కమిషనర్ రాము, వాటర్ సప్లై ఎస్ఈ కె. శ్రీనివాస్, ఈఈలు సంతోషి, దిలీప్, ప్రసన్న, డిఈ వీరయ్య, టీడీపీ వార్డ్ కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడీ రమణ, గల్లా చిన్న, శరగడం రాజశేఖర్, నియోజకవర్గ కూటమి నేతలు, వార్డ్ నాయకులు, మహిళా నాయకులు, బూత్ ఇంచార్జులు, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. ఈ సమీక్షా సమావేశం ద్వారా స్థానిక అభివృద్ధికి మరింత గతి చేరనుంది. పెండింగ్ పనులపై స్పష్టమైన సమీక్ష, ప్రతిపాదనలు, సమయబద్ధ చర్యలతో ప్రజల మౌలిక వసతుల అవసరాలను తక్షణమే తీర్చే దిశగా చర్యలు తీసుకోవాలని గణబాబు హితవు పలికారు. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం మెరుగైన అభివృద్ధికి బాటలు వేయనుందని ఆశాజనక సంకేతాలు వ్యక్తమవుతున్నాయి.

# ఐటీడీఏ కార్మికుల ఆందోళన

**అదిలాబాద్, అక్టోబరు 16 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటిడిఏ కార్యాలయం ముందు గత కొద్దిరోజులుగా ఆశ్రమ పాఠశాలలో పనిచేసే డైలీ వేజ్ వర్కర్స్ ధర్నా చేస్తున్నారు. వారంతా ఇప్పుడు నిరవధిక సమ్మె చేపట్టారు. ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లాలో ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేసే రోజువారీ కార్మికులు, కాంట్రాక్ట్ వర్కర్స్ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చస్తున్నారు. నిరవధిక సమ్మె చేపట్టి ఆందోళన కొనసాగిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐటిడిఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీ వేజ్, కాంట్రాక్ట్ వర్కర్స్ సిబ్బంది తాము గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నప్పటికీనీ చాలి చాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమకు ఉద్యోగ భద్రత కూడా లేదంటూ నాలుగు నెలలకోసారి ఇచ్చే వేతనాలు కూడా సరిపోవడం లేదంటూ అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 64 జీవోను విడుదల చేసిందని, ఆ జీవోను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. దినసరి ఉద్యోగుల ఐకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, ఐటీడీఏ డైలీ వైస్ వర్కర్స్ మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు కొడప మధునమ్మ, ఐటిడిఏ డైలీ వైస్ వర్కర్స్ రాష్ట్రఅధ్యక్షులు టేకం ప్రభాకర్, మరియు ఆదిలాబాద్ %జ%ఖ% జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ లు ఏబీపీ దేంతో తమ ఆవేదన వెలిబుచ్చారు. గత 43 రోజులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సమ్మె
కొనసాగుతోందని, ఉట్నూర్ ఐటిడిఏ కార్యాలయం ముందు 3 రోజులుగా 72గంటల నిరవధిక సమ్మె చేయడం జరుగుతుందని, ప్రభుత్వం గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న తమని గుర్తించాలని తమ విద్యార్థులకుసేవలు అందించే విధంగా తమకు ఉద్యోగ భద్రత తో పాటు కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఐటిడిఏ కార్యాలయం ముందు రాత్రి పగలు ఇక్కడే ఉంటూ రాత్రుల్లోనూ ధర్నా నిర్వహించడంజరిగిందని, అయినా ఏమాత్రం తనని ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను పట్టించుకోవాలని.. ఆదుకోకపోతే తాము ఎలా బతకాలని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తమన్యాయమైన డిమాండ్లను పరిష్కరించి తమకి ఉద్యోగ భద్రత కల్పిస్తూ కనీస వేతనం పెంచి తమని ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకొంటున్నారు. లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేసి గిరిజన సంక్షేమ శాఖకార్యాలయం అదే విధంగా మంత్రుల ఇళ్లు, ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు.

# కేసీఆర్ ఫోటో లేకుండా కవిత యాత్ర



**హైదరాబాద్, అక్టోబరు 16, పెన్ పవర్:** భారత రాష్ట్ర సమితి బహిష్కృత నేత కల్వకుంట్ల కవిత తన రాజకీయ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. నేరుగా ప్రజల వద్దే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. త్వరలోనే ఆమె జాగృతి జనం బాట పేరుతో రాజకీయ యాత్రమొదలు పెట్టబోతున్నారు. ఈ నేపథ్యంలోనే తన రాజకీయ ప్రయాణాన్ని.. తన లక్ష్యాలను కవిత మరోసారి వివరించారు. ఈసారి కూడా తనదైన శైలిలో ఆరోపణలు, విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారత
రాష్ట్ర సమితి అగ్ర నాయకులు కేటీఆర్, హరీష్ రావు రెట్టించిన ఉత్సాహంతో ప్రచారం చేస్తున్నారు. మాగంటి సునీత గోపీనాథ్ ను గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. గులాబీ పార్టీ ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకోవడానికిప్రయత్నిస్తుండగా.. కవిత కూడా తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి ప్రజల వద్దే తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. జాగృతి జనం బాటకు సంబంధించి కవిత సంచలన విషయాలను వెల్లడించారు. ప్రస్తుత కాంగ్రెస్‌ప్రభుత్వం లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను నేరుగా తెలుసుకోవడానికి తాను ఈ యాత్ర చేపడుతున్నట్టు కవిత పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేది కుంటుపడిపోయిందని.. ప్రజలు అన్ని విధాలుగా ఇబ్బంది పడుతున్నారని.. ప్రభుత్వ పెద్దలు మాత్రం రైజింగ్ తెలంగాణ అంటూ నినాదాలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. కాంగ్రెస్ పరిపాలనలో తెలంగాణ ఏ విధంగా నష్టపోతుందో చెప్పడానికి తాను ఈ యాత్ర చేస్తున్నట్టుకవిత పేర్కొన్నారు. రాజకీయంగా కూడా తన స్థానాన్ని తెలంగాణ ప్రజల గుండెల్లో సుస్థిరం చేసుకోవడానికి అడుగులు వేస్తున్నట్టు కవిత వెల్లడించారు. యాత్రకు సంబంధించి విధివిధానాలు మరికొద్ది రోజుల్లో వెల్లడిస్తాననికవిత పేర్కొన్నారు. యాత్ర చేస్తున్న నేపథ్యంలో కవిత కెసిఆర్ ఫోటోలు లేకుండానే ప్రజల ముందుకు వెళుతున్నట్టు తెలుస్తోంది. ఇదే విషయాన్ని కొంతమంది విలేకరులు కవిత ఎదుట ప్రస్తావించారు. దానికి ఆమెతనదైన శైలిలో సమాధానం చెప్పింది." కెసిఆర్ లాంటి వ్యక్తి కడుపున పుట్టడం జన్మజన్మల అదృష్టం. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప అటువంటి భాగ్యం కలగదు. నాకు అది దక్కింది. కాకపోతే ఇప్పుడు రాజకీయంగా
దారులు వేరయ్యాయి. అలాంటప్పుడు కేసీఆర్ పేరు చెప్పడం అనేది నైతికంగా సరైనది కాదు. చెట్టు పేరు చెప్పుకొని పండ్లు అమ్ముకునే దుస్థితి నాకు లేదు. నేను వేరే దారి చూసుకుంటున్న. గతంలో జాగృతి సంస్థనుఏర్పాటు చేసినప్పుడు నేను కేసీఆర్ ఫోటో పెట్టలేదు. జయశంకర్ సార్ ఫోటో మాత్రమే వాడుకున్నాం. రాజకీయంగా ఆలోచనలు వేరే విధంగా ఉన్నప్పుడు కెసిఆర్ ను స్మరించడం సరైన విధానం కాదని" కవిత క్లారిటీఇచ్చారు. ఇటీవల కవిత జాగృతి ఆధ్వర్యంలో లీడర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తర్వాత జాగృతి సంస్థను బలోపేతం చేయడానికి కృషి చేశారు. జిల్లాలలో పలు కమిటీలను ఏర్పాటు చేశారు. వారి నియామకంతక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ఇప్పుడిక జిల్లాల బాటను మొదలుపెట్టారు కవిత. ఈ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో తనకంటూ బలమైన రాజకీయ పునాదులు వేసుకునేందుకు ఆమె అడుగులువేస్తున్నారు. ఇప్పటికే తన యాత్రకు సంబంధించి శ్రేణులకు కవిత దిశా నిర్దేశం చేశారు. అడుగులుగా ఆరోపణలు చేయకుండా సెటిల్డ్ గా మాట్లాడుతున్నారు కవిత. అందువల్లే మీడియా కూడా ఆమె వార్తలకు విపరీతమైన ప్రయారిటీ ఇస్తోంది

# చిచ్చు పెడుతున్నాడని.. పొగ బెట్టారు



**వరంగల్ అక్టోబరు 16, పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్రంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మధ్య విభేదాలు తారాస్థాయికి చేరినట్లు కనిపిస్తోంది. నిన్న మేడారం అభివృద్ధి పనులకు సంబంధించిననిర్వహించిన సమీక్ష సమావేశానికి సురేఖ హాజరు కాలేదు. అంతకుముందు అభివృద్ధి పనులకు సంబంధించి తను చెప్పిన వారికి కేటాయింపు జరగడంలేదని సురేఖ అంతర్గతంగా వ్యాఖ్యానించినట్టు మీడియాలో వార్తలుప్రసారమయ్యాయి. దీనికి తోడు కొండా దంపతులు ఈ వ్యవహారంపై అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు కూడా వార్తలు వచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగ ప్రవేశం చేశారని.. కొండా దంపతులతో సీరియస్ గామాట్లాడారని ప్రచారం కూడా జరిగింది. గులాబీ పార్టీకి చెందిన మీడియా ఈ వార్తలకు విరితమైన ప్రయారిటీ ఇచ్చింది. ఇవన్నీ నిజం కాదని.. ఊహాగానాలు మాత్రమేనని కొండా క్యాంప్ పేర్కొంది. ఇదంతా జరుగుతుండగానే కొండా సురేఖకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. సురేఖ ప్రైవేట్ ఓ ఎస్ డి సుమంత్ ను ఆ పదవి నుంచి తొలగించింది. సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న దేవాదాయ, అటవీ శాఖలో డిప్యూటేషన్లు, బదిలీలు మొత్తంసుమంత్ చెప్పినట్టే జరుగుతున్నాయని తెలుస్తోంది. దీనికి సంబంధించి కూడా కొన్ని ఆరోపణలు వినిపించాయి. సుమంత్ ఏకంగా ఐఏఎస్ స్థాయి వ్యక్తులకు ఆర్డర్లు వేసేంతగా ఎదిగారని ఆరోపణలు వినిపించాయి.
పాలనాపరమైన వ్యవహారాలలో సుమంత్ కలగచేసుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇంటలిజెన్స్ ద్వారా నివేదిక తెప్పించుకొని సుమంత్ ను పక్కన పెట్టారు. సుమంత్ ను పీసీబీ టెర్మినేట్ చేసేది. దేవాదాయ, అటవీశాఖలలో తన స్థానాన్ని ఆయన దుర్వినియోగం చేసినట్టు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా మేడారం అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న పనుల విషయంలో సురేఖ, శ్రీనివాస రెడ్డికి మధ్య విభేదాలుఏర్పడేందుకు కారణం అతడేనని తేలింది. సరిగ్గా 2023లో డిసెంబర్ నెలలో సుమంత్ ఓ ఎస్ డి గా నియమితులయ్యారు. ఆయన కాంట్రాక్ట్ ను 2025 వరకు పొడగించారు. తనకు ఉన్న అధికారాన్ని దుర్వినియోగంచేయడంతో పాటు.. తెర వెనుక ఇతర వ్యవహారాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అతనిపై వేటువేసింది. సుమంత్ ను తక్షణమే విధుల నుంచి తప్పుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అటవీ శాఖలోసుమంత్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో.. ఆ శాఖలో పనిచేస్తున్న ఉన్నత సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. చివరికి ఆ శాఖలో పనిచేస్తున్న పెద్ద పెద్ద స్థాయి అధికారులకు కూడా సుమంత్ ఆదేశాలుఇచ్చేంతగా ఎదిగిన నేపథ్యంలో.. వారంతా కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. అందువల్లే సుమంత్ మీద ప్రభుత్వం వేటు వేసినట్టు సమాచారం. అయితే సుమంత్ ను తొలగించిన నేపథ్యంలో కొండ
సురేఖ ఇంతవరకు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మరి దీనిపై ఆమె ఏ విధంగా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

# బాకీ కార్డు పై బిఆర్ఎస్ కు బహిరంగ చర్చకు సవాల్ విసిరిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ఎన్నికల్లో ఎవరు ఏమి హామీలు ఇచ్చారు... ఎంతవరకు నెరవేర్చారో బహిరంగ చర్చకు బిఆర్ఎస్ రావాలని డిమాండ్
డేట్, టైమ్, స్థలం నిర్ణయించాలని సూచన
బెస్ట్ అవలేబుల్ స్కూల్ పెండింగ్ ఫీజులు వారం రోజుల్లో 25% చెల్లిస్తామని వెల్లడిబాకీ కార్డు పై బిఆర్ఎస్ కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. బహిరంగ చర్చకు డేట్, సమయం, స్థలం నిర్ణయించండని స్పష్టం చేశారు.
ధర్మపురిలో మీడియాతో మాట్లాడిన అడ్లూరిలక్ష్మణ్ కుమార్ బిఆర్ఎస్ తీరు నేతల వైఖరిపై ఫైర్ అయ్యారు. ఎన్నికల్లో బిఆర్ఎస్ ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై బహిరంగ చర్చకు బిఆర్ఎస్ సిద్ధమా అని ప్రశ్నించారు. సమయం, స్థలం
చెప్పండని బిఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రక్కన దళిత మంత్రి కూర్చున్న దాఖలాలు లేవని, కొప్పుల ఈశ్వర్ మంత్రిగా సీఎం ప్రక్కన కూర్చోబోతే పక్కన కూర్చోమన్నవిషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులను తన కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారని తెలిపారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో చిన్న చిన్న సమస్యలు వచ్చిన వెంటనే సమస్సిపోతాయని, చిన్న చిన్న సమస్యలను భూతద్దంలో పెట్టి చూడాల్సిన పనిలేదన్నారు. బెస్ట్ అవలేబుల్ స్కూల్ విద్యార్థుల ఫీజు బకాయి గత ప్రభుత్వ పుణ్యమేనని విమర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గత మూడేళ్లుగా బెస్ట్ అవలేబుల్ స్కూల్ విద్యార్థుల పెండింగ్ ఫీజులు వారం రోజుల్లో 25% చెల్లిస్తామని చెప్పారు. మిగిలిన 75% ఫీజు విడతల వారీగా చెల్లించేందుకు సీఎం సిద్దంగా ఉన్నారని తెలిపారు. తమ శాఖకు 60కోట్ల రూపాయల చెక్కులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారని తెలిపారు.

## అభివృద్ధికి చిహ్నాం చంద్ర బాబు



**విశాఖపట్నం. పెన్ పవర్:** .పెట్టుబడులకు స్వర్గ ధామం గా ఆంధ్ర ప్రదేశ్ అవతరించింది. అభివృద్ధికి చిహ్నాం చంద్ర బాబు. 16 నెలల్లో ఆరున్నర లక్షల కోట్లు పెట్టుబడులు ఒప్పందాలు జరిగాయి. ప్రపంచం లో దిగ్గజ కంపెనీలు మన రాష్ట్రం లోపెట్టుబడులు పెట్టడానికి వస్తున్నాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ అన్నారు. ఇప్పుడు గూగుల్ డేటా సెంటర్ విశాఖ కు వచ్చింది.. బ్యాంక్ లు, బ్లడ్ బ్యాంకులు ఎలాంటివో.. సమాచారం పొందు పరిచేదే డేటా సెంటర్ అంటే. అమెరికా ప్రజలు వాడే డేటా కన్నా.. మూడు రెట్లు డేటా మన దేశం లోవినియోగిస్తున్నాం. ఈ డేటా వలన వచ్చే లాభాలు అమెరికాకు వెళ్తున్నాయి. లక్ష ముప్పై వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు రాబోతున్నాయి. ప్రస్తుతం మనదేశం లో వున్న డేటా సెంటర్ లు మొత్తం వెయ్యి మెగావాట్లడేటాను ఉత్పత్తి చేస్తున్నాయని అన్నారు. చంద్రబాబు నాయుడు అద్భుతాలు సృష్టిస్తున్నారు. జగన్ హయం లో అభివృద్ధి సున్నా. అన్ని రంగాలలో రాష్ట్రం అభివృద్ధి వైపు దూసుకు పోతుంది అంటే చంద్రబాబు, లోకేశ్ కారణం. నకిలీ మద్య వ్యాపారాలు ఇప్పటికీవైసీపీ వాళ్ళు నిర్వహిస్తూ... టిడిపి పై బురద జల్లా లని చూసి అడ్డంగా దొరికి పోయారు. రాజకీయాలు ప్రజల బాగుకోసం కోసం చేయాలి.. మీలా మీ స్వప్రయోజనాల కోసం కాదు. ఈదేశం లో పెద్ద కంపెనీలు అన్నీ మీరాష్ట్రం లో పెట్టుబడులు పెడతాం అని చంద్రబాబు వెంట పెడుతున్నాయి.. చంద్రబాబు ఇమేజ్ అంటే అది. అమర్నాద్ గతం లో మీరు డేటా సెంటర్ తెచ్చామని హడావుడి చేశారు.. చివరకు ఏమైంది.. వైసీపీ హయం లోఅదానీకి 180 ఎకరాలు ఎండాడ లో కేటాయించి కోట్ల రూపాయలు ఎకరానికి అమ్ముకున్నది మీరు కాదా అని ప్రశ్నించారు.

## బీచ్ ఫెస్టివల్ కు ఏర్పాట్లు పూర్తి

**కోనసీమ: పెన్ పవర్:** అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యా నంలో సంక్రాంతి కి కోనసీమ బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు అన్ని ఏర్పాట్ల ను పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావుతో కలసి ఎస్. యానం బీచ్ పరిసరా లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బీచ్ లో మౌలిక వసతుల కల్పన, సందర్శకులకు ఆతిధ్య సేవలు, వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్అధికారులతో సమీక్షించారు. కోనసీమ పర్యాటక రంగ అభివృద్ధికి హొంస్టే లు తోడ్పాటునిస్తాయని ఇందుకు గ్రామస్తులు తమ సహకారం అందించి పర్యాటకులకు ఆతిథ్యం ఇవ్వాలని కోరారు. ఎస్.యానం బీచ్ లో రెండు మూడు కిలోమీటర్ల పొడవున లైటింగ్ ఏర్పాటుతోపాటు సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. ఎస్.యానం బీచ్ అభివృద్ధికి పర్యాటక శాఖ మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లానని జిల్లా కలెక్టర్ సహకారంతో పూర్తి చేస్తామని శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు తెలిపారు.

## చైన్ స్నాచర్ అవతారమెత్తిన పోలీసు దేహశుద్ధి చేసిన స్థానికులు

**నంద్యాల: పెన్ పవర్:** నంద్యాల జిల్లా డోన్లో ఓ కానిస్టేబుల్ చేతివాటం ప్రదర్శించాడు. శ్రీరాంనగర్లో అంగట్లో కూర్చున్న ఓ మహిళ మెడలో ఐదు తులాల బంగారం చైన్ను కానిస్టేబుల్ ఆచారి బలవంతంగా దొంగలించేందుకు ప్రయత్నించాడు. మహిళ కేకలు వేయడంతో స్థానికులు పట్టుకుని చితకొట్టారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కానిస్టేబుల్ ఆచారిని అరెస్ట్ చేసి స్టేషన్ను తరలించారు

## నాపై గతంలో చాలా కుట్రలు జరిగాయి

**హనుమకొండ: పెన్ పవర్:** హనుమకొండ రాంనగర్ లోని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మీడియా తో మాట్లాడారు. సీఎం రేవంత్ అన్న ఎమ్మెల్సీ పదవి ఇస్తా అన్నారు.. ఇస్తారు . నేను ఏ రోజు సచివాలయం కు పోలేదు. మాజీ దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉన్న సమయంలో ఆయన వాహనంలోనే సచివాలయానికి వెళ్లాను. సురేఖ గెలిచిన తర్వాత మొదటిసారిగా రాత్రి కొండ సురేఖ ఛాంబర్ కు వెళ్లి వాస్తు చూసి వచ్చాను. నాకు ఏదైనా పని ఉంటే నేరుగా మంత్రి ఇండ్లలోకే వెళ్తా తప్ప సచివాలయానికి వెళ్ళనని అన్నారు. నా బిడ్డ సుస్మిత పార్టీలకు ఎలాంటి పదవులు లేవు. నా మనవరాలు లండన్ లో చదువుతుంది. మనవడు లండన్ కు వెళ్తాడు. నా అల్లుడు లండన్ లో వ్యాపారం చేస్తున్నాడు. నా బిడ్డకు మాట్లాడే స్వేచ్ఛ ఉంది. తాను ఏం మాట్లాడిందో నాకు తెలియదు. నిన్న రాత్రి సుమంత్ ఎపిసోడ్ కోసం నాకు తెలియదు. నాకు ఫోన్ కూడా సరిగ్గా వాడరాదు. నాకు వరంగల్ మీడియా మిత్రులపై అమితమైన ప్రేమ ఉంది. నాకు ఎల్లవేళలాఅండగా ఉన్నారు. ఉదయం నేను లేవగానే గేటు బయట మీడియా ప్రతినిధులు ఉన్నారు. నేనే లేచి వాళ్ళని లోపల వచ్చి మర్యాద చేశా. నాపై గతంలో చాలా కుట్రలు జరిగాయి. అందుకే కొండా సురేఖ వాహనంనేను ఈరోజు ఎక్కా లే. మేము వేరువేరుగానే పర్యటిస్తాం. నన్ను టార్గెట్ చేస్తే ఎదుటివారికే నష్టం. ఇప్పటికే నేను చాలాసార్లు దెబ్బతిని ఈ స్థాయిలో ఉన్ననని అన్నారు.

## రాత్రివేళల్లో అనవసరంగా తిరుగుతున్న 181 మందిపై పోలీసుల చర్య

173 "టౌన్ న్యూసెన్స్" కేసులు నమోదు

**గుంటూరు: పెన్ పవర్:** బుధవారం రాత్రి పోలీసులు జిల్లా వ్యాప్తంగా "ప్రత్యేక డ్రైవ్ " నిర్వహించారు.
రాత్రి వేళల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, రోడ్లపై అనవసరంగా తిరుగుతూ ప్రజల భద్రతకు భంగం కలిగించే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసున్నారు. టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద 181 మందిపై 173 కేసులు నమోదు చేసి, వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ "మద్యం సేవించి రాత్రి వేళల్లో రోడ్లపై తిరగడం వలన గొడవలు, అల్లర్లు, దొంగతనాలు వంటి ఘటనలు సంభవించే అవకాశం ఉంటుంది. ప్రజలు రాత్రి సమయాల్లో అనవసరంగా బయటకు రావద్దు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీ బృందాలను మరింత బలోపేతం చేసి, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో సంచరిస్తున్న అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి విచారణలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్స్ ఉన్నవారు ఏవైనా సంఘటనల్లో పాల్గొంటే, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# గన్నవరంలో రోడ్డు ప్రమాదం వ్యక్తి మృతి

**గన్నవరం పెన్ పవర్:** గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ దగ్గర జాతీయ రహదారిపై లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామానికి చెందిన గరికపాటి సుబ్బారావు రిటైర్డ్ రైల్వే ఎంప్లాయ్ గా గుర్తించారు. రైతు బజార్‌లో కూరగాయలు కొనుక్కొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న సుబ్బారావు ను లారీ ఢీకొంది. సుబ్బారావు ఘటన స్థలంలోనే మృతి చెందాడు. లారీ డ్రైవర్ పరారీ అయ్యాడు. గన్నవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# సుమంత్ విషయం నాకు తెలియదు

**హైదరాబాద్: పెన్ పవర్:** మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్టీ సుమంత్ విషయం తనకు తెలియదని ఆమె భర్త కొండా మురళీ చెప్పారు. నిన్న హైదరాబాద్ లో మంత్రి ఇంటి వద్ద హైడ్రామా పై హన్మకొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. తనకూతురు పార్టీలోగానీ పదవిలోగానీ లేదన్నారు. సీఎం రేవంత్ తనకు ఎమ్మెల్సీ ఇస్తానన్నారని వెల్లడించారు. పొంగులేటి వివాదంపై స్పందిస్తూ 'సీఎం, పొంగులేటి మా ఇంటికీ వచ్చారు. వారు నన్నెందుకు టార్గెట్
చేస్తారు?' అని వ్యాఖ్యానించారు.

# 18న గ్రూప్ 2 నియామక పత్రాలు

**హైదరాబాద్, అక్టోబరు 16 పెన్ పవర్:** తెలంగాణ గ్రూప్ 2 సర్వీసు పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలు సెప్టెంబర్ 28న విడుదలైన సంగతి తెలిసిందే. మొత్తం 783 పోస్టులకు గానూ 782 పోస్టులకు ఎంపిక జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేసింది.
మిగిలిప ఒక పోస్టు మాత్రం భర్తీ కాలేదని, విత్ హెల్డ్‌లో పెట్టినట్లు వెల్లడించింది. మొత్తం 16 శాఖల్లో 18 రకాల పోస్టులకు సంబంధించి టీజీపీఎస్సీ గ్రూప్ 2 తుది ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోఉంచింది. ఇక గ్రూప్ 2 పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందించేందుకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేస్తుంది.. తాజా ప్రకటన మేరకు గ్రూపు 2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు అక్టోబరు 18వతేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదగా నియామక పత్రాలు అందించనున్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఆ రోజు సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం సచివాలయంలో సమీక్ష జరిపారు. ఈ నియామకాల్లో సాధారణ పరిపాలన, రెవెన్యూ, ఎక్సైజ్, పంచాయతీరాజ్, వాణిజ్య పన్నుల శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నారు.
అందువల్ల ఆయా శాఖల కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులతోపాటు వారి కుటుంబసభ్యులు కూడా ఈ కార్యక్రమానికిఅనుమతించనున్నట్లు ఆయన తెలిపారు.కాగా టీజీపీఎస్సీ గ్రూప్ 2 నోటిఫికేషన్‌ను 2022లో విడుదల చేయగా, 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగామొత్తం 2,49,964 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష ఆఫ్‌లైన్ విధానంలో జరగడంతో ఓఎంఆర్ పత్రాల్లో లోపాలు, బబ్లింగ్ సరిగా చేయకపోవడం వంటి కారణాలతో దాదాపు 13,315 మందిని కమిషన్ అనర్హులుగా ప్రకటించింది. మిగిలిన 2,36,649 మంది అభ్యర్థుల జనరల్ ర్యాంక్ లిస్ట్ (మార్కులతో సహా)ను మార్చి 11న విడుదల చేసింది. గత నెలలో తుది జాబితాను విడుదల చేసిన సంగతితెలిసిందే. ఈ లిస్టులోని వారందరికీ మరో 3 రోజుల్లో నియామక పత్రాలు అందించనున్నారు.

# సచివాలయంలో నీటి కొరత

**హైదరాబాద్, అక్టోబరు 16 పెన్ పవర్:** తెలంగాణ సచివాలయంలోనే మంచి నీటి కొరత ఏర్పడింది. తాగునీటి సరఫరా చేయాల్సిన కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో ఎండాకాలం రాకముందే కొన్ని డిపార్ట్ మెంట్స్ లో తాగునీటి సమస్య ఏర్పడింది. ఆయా
విభాగాల్లో ఉద్యోగులు సొంతంగా వాటర్ బాటిల్స్ క్యారీ చేస్తున్నారు. భోజన సమయం, టీ టైమ్ లో కూడా మంచి నీళ్లు లేకపోవడంతో కొంతమంది ఉద్యోగులు క్యాంటీన్ లో వాటర్ బాటిల్స్ కొంటున్నారు.సచివాలయంలో వాటర్ సరఫరా చేసే కాంట్రాక్టర్లకు తాగునీటి బిల్లులను సైతం చెల్లించలేని స్థితికి ప్రభుత్వం దిగజారింది అనే విమర్శలు వస్తున్నాయి. నెల నెల బిల్లులు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ మూడు రోజులుగా నీటి
సరఫరాను నిలిపివేశారు. వివిధ శాఖలకు సంబంధించి దాదాపు 20 లక్షల వరకు బిల్లులు పెండింగ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. బిల్లుల కోసం కాంట్రాక్టర్ ఎన్నిసార్లు సంబంధిత శాఖ అధికారులను సంప్రదించినా ప్రయోజనం లేకపోవడంతో చివరికి నీటి సరఫరా నిలిపివేశారు.తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నస సిబ్బంది చివరకు ఇంటి నుంచి బాటిల్ తెచ్చుకుంటున్నారు. ఆయా శాఖల నుంచి డబ్బులు రావడం లేదని, వ్యక్తిగతంగా కొనుగోలు చేసుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. ప్రతి నెల 300 ఇస్తే తాగునీరు సరఫరా చేస్తామని చెప్పడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో తాగునీటి కష్టాలు ఎండా కాలం కాకముందే ఇలా ఉండటంతో వేసవి కాలంలో ఎలాంటి పరిస్థితి ఉంటుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

# శ్రీశైలం లో పలు ప్రత్యేక పూజలు చేసిన ప్రధాని మోడీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం శ్రీశైలంలో పర్యటించారు. ముందుగా భ్రమరాంబ గెస్ట్ హౌస్ నుండి బయలుదేరి నంది మండపం సర్కిల్ ద్వారా దేవాలయ ప్రాంగణంలోని గంగాధర మండపం వైపు పయనమయ్యారు.నంది మండపం సర్కిల్ నుండి గంగాధర మండపం వరకు మార్గమంతా దాదాపు 8,000 మంది శివసేవకులు కాషాయ వస్త్రధారణలో నిలబడి హర హర మహాదేవ అంటూ ప్రధానమంత్రి కి ఘన స్వాగతం పలికారు.దేవస్థానం ప్రధాన ద్వారం వద్ద వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి భారత ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కు విభూతి, కుంకుమ ధరింపజేసి ప్రదక్షిణాకార మార్గంలో ఆలయఅంతర్భాగానికి ఆహ్వానించారు..తరనువాత మొదట ధ్వజస్తంభ నమస్కారం, శివ సంకల్పం, అనంతరం రత్నగర్భ గణపతి పూజ నిర్వహించారు. తరువాత మూలవిరాట్ శ్రీ మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగానికి ఏకవార రుద్రాభిషేకం, బిల్వార్చన,పుష్పార్చన, మహా మంగళ హారతి, మంత్రపుష్పాలతో భక్తిశ్రద్ధలతో దర్శనం చేశారు. తదుపరి నందీశ్వర దర్శనం చేసి, అర్చకులచే స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.సరస్వతి నది అంతర్వాహినిగా ప్రసిద్ధి చెందిన మల్లికాగుండం వద్ద శ్రీ స్వామివారి గర్భాలయ శిఖర దర్శనం చేసుకున్నారు. ప్రధానమంత్రి శ్రీ భ్రమరాంబ అమ్మవారి ముఖ మండపంలో ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీ
చక్రమునకు ఖడ్గమాలతో కుంకుమార్చన నిర్వహించి, షోడశోపచార పూజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అనంతరం అమ్మవారి హారతి స్వీకరించారు.తరువాత వేదాశీర్వచన మండపంలో వేద పండితులు చతుర్వేద ఆశీర్వచనం చేసి, అమ్మవారి తీర్థప్రసాదాలను ప్రధానికి సమర్పించారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రికి శ్రీ స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు మరియు శేష వస్త్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, అడిషనల్ ఐజి ఆకే రవి కృష్ణ, పోలీసు ఉన్నతాధికారి అధి రాజ్ సింగ్ రాణా, ఆలయ ఈఓ
శ్రీనివాసులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# అధిష్టానాన్ని లైట్ తీసుకుంటున్న నేతలు



**హైదరాబాద్, అక్టోబరు 16 పెన్ పవర్:**
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి పదేళ్ల తర్వాత వచ్చింది. అయితే అధికారాన్ని నిలబెట్టుకోవాల్సిన నేతలు వీధిన పడుతున్నారు. చిల్లర గొడవలకు దిగుతున్నారు. అయితే పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ ను అధినాయకత్వం నియమించినప్పటికీ నేతల్లో మాత్రం మార్పు కనిపించడం లేదని పిస్తుంది. గతంలో ఉన్న ఇన్ ఛార్జిగా ఉన్న దీపాదాస్ మున్షీని తొలగించిన పార్టీ నాయకత్వం గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండే మీనాక్షి నటరాజన్ ను ఇన్ ఛార్జిగా నియమించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన మంత్రులే గొడవ పడుతుండటం కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ను అయోమయానికి గురి చేసింది .. దీంతో మీనాక్షి నటరాజన్ కు కూడా నేతలు వెరవకుండా తమకు తోచినట్లే వ్యవహరిస్తున్నారంటున్నారు. నేతల్లో సఖ్యత కొరవడింది. ప్రభుత్వంలో మంత్రుల మధ్య కూడా సమన్వయం
కనిపించడం లేదు. చిన్న చిన్న వాటికి వారు గొడవలకు దిగుతున్నారు. మీడియాకు ఎక్కుతున్నారు. మంత్రుల తీరుపై పార్టీ నాయకత్వం ఆగ్రహంగా ఉందని అంటున్నా మీనాక్షి నటరాజన్ మాత్రం ఎలాంటి నష్టనివారణ చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినపిస్తున్నాయి. ఒకవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో పాటు త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరిగే అవకాశముండటంతో వరసగా మంత్రులు గొడవలకు దిగడం పార్టీ శ్రేణులకు మింగుడు పడటం లేదు... మీనాక్షి నటరాజన్ రాహుల్ కోటరీలో కీలకమైన నేత కావడంతో ఆమె పార్టీని సెట్ చేశారని అనుకున్నారు. ఆమె సాదాసీదాగానే ఉంటున్నారు. జీవనశైలి ఇక్కడ ముఖ్యం కాదు.
పార్టీని గాడిలో పెట్టడం ముఖ్యమన్నది మీనాక్షి నటరాజన్ మర్చిపోతున్నారన్నకామెంట్స్ వినపడుతున్నాయి. మీనాక్షి నటరాజన్ మధ్యప్రదేశ్ లో బయోకెమిస్ట్రీలో పీజీ చేశారు. ఇండోర్ లో చదువుకుంటూనే
రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాహుల్ గాంధీ సింప్లిసిటీని చూసి ఆమె కూడా అదే పార్టీని ఎంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థి అనుబంధ విభాగమైన ఎన్.ఎస్.యూ.ఐ లో పనిచేశారు. తర్వాత 2008లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.2009 ఎన్నికల్లో మందసౌర్ నుంచి పోటీ చేసి మీనాక్షి నటరాజన్ విజయం సాధించారు. గతంలో 2024, 2019 ఎన్నికల్లో ఓటమి పాలయి 2024 లో విజయం సాధించి ఎంపీగా ఎన్నికయ్యారు. రాహుల్ టీం లో ఒక సభ్యురాలిగా చేరారు. రాహుల్ గాంధీకి నమ్మకమైన నేతగా పేరుపొందారు. అయినా సరే నేతలు మాత్రం ఎటువంటి జంకు లేకుండా పార్టీ పరువును వీధికెక్కిస్తున్నారు. మంత్రులే కాదు ఎమ్మెల్యేలు కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేసి పార్టీని ఇరకాటంలోకి నెడుతున్నారు. మీనాక్షి నటరాజన్ నేరుగా ఇక్కడి విషయాలను రాహుల్ గాంధీకి చేరవేసే చొరవ ఉన్నప్పటికీ ఆమె ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోజుకో రగడ పార్టీని ప్రజల్లో నవ్వుల పాలు చేస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేళ్ల పాటు అధికారంలో కాంగ్రెస్ ఉంటుందని చెబుతున్నప్పటికీ పార్టీ నేతలు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. కోమటిరెడ్డి సైతం
కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఎక్సైజ్ పాలసీని సమీక్షించాలని కోమటిరెడ్డి కోరారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుకునేలా లిక్కర్ సిండికేట్లు వ్యవహరిస్తున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం వేళ మద్యం దుకాణాలు తెరిచి ఉండటంతో పగలు, రాత్రనక మద్యం తాగుతూ ఆర్థికంగా కుటుంబాలు నలిగిపోతున్నాయని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. అందుకే సాయంత్రం వేళల్లో మాత్రమే మద్యం షాపులు తెరిచేలా ప్రభుత్వం ఎక్సైజ్ పాలసీని మార్చాలన్నారు. మునుగోడు నియోజకవర్గంలో మాత్రం తాను ఊరిలో వైన్ షాపునకు అనుమతిచ్చే ప్రసక్తి లేదని
తెలిపారు. ఊరి బయట వైన్ షాపులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై తాను ప్రభుత్వంతో మాట్లాడతానన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మద్యం విషయంలో తాను రాజీపడబోనని చెప్పారు.

# ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ ఎగ్జామ్స్



**హైదరాబాద్, అక్టోబరు 16 పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈసారి కాస్త ముందుగానే ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే ఏపీలో ఇంటర్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభంకానున్నట్లు ప్రకటన వెలువడింది.ఇందుక సంబంధించిన టైం టేబుల్ కూడా అక్కడి ఇంటర్ బోర్డు తాజాగా విడుదల చేసింది. ఇక ఇదే పంథాలో తెలంగాణ ఇంటరో బోర్డు కూడా అడుగులు వేస్తుంది. తెలంగాణలో కూడా ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్‌పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నుంచే ప్రారంభించనున్నట్లు తాజాగా ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం నివేదికను పంపింది.ప్రభుత్వం ఆమోదం తెలియజేస్తే 2026 ఫిబ్రవరి23 లేదా 25 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మొదలవనున్నాయి. ఈ మేరకు రెండు రకాల టైం టేబుళ్లను సర్కారుకు పంపారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా సీఎం రేవంత్‌రెడ్డి కొనసాగుతున్నందున ఆయన ఆమోదంతర్వాతనే ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. మరోవైపు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమై.. మార్చి 24వ తేదీతో ముగియనున్నాయి. సరిగ్గా ఇదే తేదీల్లో తెలంగాణలోనూ ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. లేదంటే ఒక రోజు అటుఇటుగా మొదలవుతాయి. అయితే ఏపీ కంటే ముందుగానే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు తెలంగాణలో పూర్తయ్యే అవకాశం ఉంది.గతంలోఅంటే కరోనాకు ముందు ఫిబ్రవరి నెలాఖరులోనే పరీక్షలు మొదలయ్యేవి. కరోనా మహమ్మారి ప్రభావంతో ఇది కాస్తా మార్చికి మారింది. అప్పటి నుంచి మార్చిలోనే ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. అయితే ఫిబ్రవరిలోనే ఇంటర్ పరీక్షలు జరిగితే జేఈఈ మెయిన్, ఈఏపీసెట్, నీట్‌కు సన్నద్ధమయ్యే వారికి కాస్త వెసులుబాటు లభిస్తుంది. గత ఏడాది మార్చి 5న ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. మరోవైపు జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి ప్రారంభమయ్యాయి. దాంతో ఇంటర్ పరీక్షలు రాసిన వారికి కేవలం 12 రోజులు మాత్రమే సన్నద్ధతకు లభించాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షలకు దాదాపు 9 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే పరీక్షలు మొదలైతే విద్యార్థులకు ఇతర నీట్, జేఈఈ వంటి పరీక్షలకు
సన్నద్ధమయ్యేందుకు సమయం లభిస్తుంది.ఇదిలా ఉంటే మరోవైపు ఇంటర్ పరీక్షల ఫీజు పెంచాలని ఇంటర్ బోర్డు భావిస్తుంది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపింది. ప్రాక్టికల్స్ లేని కోర్సులకు రూ.520, ప్రాక్టికల్స్ ఉండే పరీక్షలకు ఎంపీసీ, బైపీసీ, జువాలజీ గ్రూపులతోపాటు ఒకేషనల్ కోర్సులకు మొత్తం రూ.750 వరకు పరీక్ష ఫీజు కింద చెల్లిస్తున్నారు. ఇంటర్ బోర్డు ప్రతిపాదనలను రేవంత్ సర్కార్ ఆమోదిస్తే ప్రాక్టికల్స్ లేని కోర్సులకు రూ.600, ప్రాక్టికల్స్ ఉన్న పరీక్షలకు రూ.875 వరకు ఫీజు పెరిగే అవకాశం ఉంది.

# అటు అక్క, ఇటు తమ్ముడు.. ఓటర్లు ఆ గట్టునుంటారా? ఈ గట్టునుంటారా?

**హైదరాబాద్, అక్టోబరు 16 పెన్ పవర్:**
అప్పుడు జూబ్లీహిల్స్ బస్తీలు ఖైరతాబాద్ సెగ్మెంట్లోనే ఉండేవి. ఆ ఏరియాల్లో పీజేఆర్‌కు మంచి పట్టు ఉండేది. ఇప్పటికీ జూబ్లీహిల్స్‌లో పీజేఆర్‌కు పెద్ద ఎత్తున అభిమానులు ఉన్నారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాజకీయంరసవత్తరంగా సాగుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత పోటీ చేస్తుండగా.. వారిద్దరికి మద్దతుగా ఆ అక్కా తమ్ముడు అందరి దృష్టినిఆకట్టుకుంటున్నారు. వాళ్లే ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, దివంగత నేత పీ జనార్ధన్‌రెడ్డి కూతురు విజయారెడ్డి, తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి.ప్రస్తుతం విజయారెడ్డి అధికార కాంగ్రెస్ పార్టీలో ఉండగా.. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పార్టీలో విష్ణువర్ధన్ రెడ్డి కొనసాగుతున్నారు. దీంతో ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అక్క కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమిస్తుండగా.. తమ్ముడేమో కాంగ్రెస్జెండాను ఎగరనీయనంటూ ప్రతిన పూనుతున్నారు. ఇలా వీళ్లిద్దరూజూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ పార్టీ గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. అటు విజయారెడ్డి, ఇటు విష్ణువర్ధన్రెడ్డి ఇద్దరు పీజేఆర్ వారసులు. గతంలో ఇద్దరు కాంగ్రెస్‌లో పనిచేశారు. జూబ్లీహిల్స్ నుంచి విష్ణువర్ధన్‌రెడ్డి,ఖైరతాబాద్‌లో విజయారెడ్డి పాలిటిక్స్ చేసుకుంటూ వచ్చారు. ఆ తర్వాత విజయారెడ్డి బీఆర్ఎస్‌లో చేరి కార్పొరేటర్‌గా కూడా ఎన్నికయ్యారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల ముందు విజయారెడ్డి కాంగ్రెస్‌లోకివెళ్లగా..విష్ణువర్ధన్‌రెడ్డి కారెక్కేశారు. అయితే పీజేఆర్ గతంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా పనిచేశారు.అప్పుడు జూబ్లీహిల్స్ బస్తీలు ఖైరతాబాద్ సెగ్మెంట్లోనే ఉండేవి. ఆ ఏరియాల్లో పీజేఆర్‌కు మంచి పట్టు ఉండేది. ఇప్పటికీ
జూబ్లీహిల్స్‌లో పీజేఆర్‌కు పెద్ద ఎత్తున అభిమానులు ఉన్నారు. ఈ ఈక్వేషన్‌లో అటు కాంగ్రెస్ విజయారెడ్డి ద్వారా..ఇటు బీఆర్ఎస్ విష్ణువర్ధన్‌రెడ్డితో పీజేఆర్ అభిమానులను, బస్తీ వాసులకు ఆకట్టుకునే ప్రయత్నంచేస్తున్నాయి.ఇదే సమయంలో పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలుపు బాధ్యతను భుజాన వేసుకున్నారు. మాగంటి గోపీనాథ్ మరణంతో వచ్చిన ఈ ఉప ఎన్నికను పర్సనల్‌గా తీసుకున్నవిష్ణువర్ధన్రెడ్డి..పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించుకునేందుకు శాయశక్తులా పనిచేస్తున్నారు. ఆమె వెంటే ఉంటూ సొంత సోదరిలా ఆమె గెలుపే తన గెలుపుగా భావిస్తూ జూబ్లీహిల్స్ గల్లీ గల్లీ తిరుగుతున్నారు.తానుబతికి ఉన్నంతవరకు ఇక్కడ కాంగ్రెస్ జెండాను ఎగురనివ్వనంటూ భీషణ శపథం కూడా చేశారు విష్ణు. జూబ్లీహిల్స్‌లో కచ్చితంగా గులాబీ జెండా ఎగురుతుందని, ఆ బాధ్యత తానే తీసుకుంటున్నానని విష్ణువర్ధన్ రెడ్డి
గంటాపథంగా చెబుతున్నారు. ఇలా జూబ్లీహిల్స్‌లో అటు అక్కా, ఇటు తమ్ముడు.. ఒకరు కాంగ్రెస్ కోసం, మరొకరు బీఆర్ఎస్ కోసం తీవ్రంగా శ్రమించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ఎందుకంటే వీళ్ళిద్దరూజూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అభ్యర్థులు కాదు.కానీ ఒకరు మాజీ ఎమ్మెల్యే అయితే, మరొకరు జీహెచ్ఎంసీ కార్పొరేటర్. విష్ణువర్ధన్ రెడ్డి జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యేగా రెండు సార్లు మాగంటి గోపీనాథ్‌పై పోటీ చేసిఓడిపోయారు. కానీ ఇప్పుడు అదే మాగంటి కుటుంబం కోసం ఆయన సతీమణి సునీత తరఫున బీఆర్ఎస్‌ను గెలిపించుకునేందుకు పనిచేస్తుండటం ఇంట్రెస్టింగ్‌గా మారింది. జూబ్లిహిల్స్ నుంచి మళ్ళీ తాను ఎమ్మెల్యే
కావాలని బలంగా కోరుకోవాల్సిన విష్ణువర్ధన్ రెడ్డి..ఇప్పుడు మాగంటి సునీత కోసం పనిచేయాల్సి రావడం ఆసక్తికరంగా మారింది.ఇక ప్రస్తుతం కార్పొరేటర్‌గా ఉన్న విజయారెడ్డి కూడా ఎప్పటినుంచో ఎమ్మెల్యేగా పోటీచేయాలని అనుకుంటున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గ టికెట్ ఆశిస్తున్న విజయారెడ్డికి అవకాశం మాత్రం రావడం లేదు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం సీరియస్‌గా పనిచేస్తూ..అధిష్టానంద్రుష్టిలో పడేందుకు..పార్టీ రాష్ట్ర పెద్దలను మన్ననలను పొందేందుకు విజయారెడ్డి ప్రయత్నం చేస్తున్నారట.జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే వచ్చే ఎన్నికల్లోనైనా తనకు ఖైరతాబాద్ టికెట్ దక్కడానికి ప్లస్
పాయింట్‌గా మారుతుందని లెక్కలు వేసుకుంటున్నారట విజయా రెడ్డి. ఫ్యూచర్ పొలిటికల్ ప్లాన్‌లో భాగంగా అక్కా కాంగ్రెస్ గెలుపుకోసం..తమ్ముడు బీఆర్ఎస్ విజయం కోసం శ్రమిస్తుండటం ఇంట్రెస్టింగ్‌గా మారింది.

# మిథున్ రెడ్డిని వెంటాడుతున్న సిట్

**తిరుపతి, అక్టోబరు 16, పెన్ పవర్:**
ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టించింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ చేపడుతుంది ప్రత్యేక దర్యాప్తు బృందం. ఒకవైపు విచారణ కొనసాగుతోంది. 29 మంది నిందితులకు గాను 12 మంది అరెస్టయ్యారు. అయితే లోతైన దర్యాప్తు చేస్తుండగా.. నిందితులు ఒక్కొక్కరికి బెయిల్ లభిస్తోంది. ఈ క్రమంలో బెయిల్ పై బయటకు వచ్చిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కార్యాలయాలతో పాటు నివాసాల్లో సిట్ తనిఖీలు చేపడుతుండడం విశేషం. మరోవైపు ఎంపీ మిథున్ రెడ్డి బిజెపిలో చేరతారని ప్రచారం సాగింది. ఈ క్రమంలో ఆయన ఐక్యరాజ్యసమితికి వెళ్లే పార్లమెంటరీ బృందంలో ఒక సభ్యుడిగా ఉండడం ప్రాధాన్యత సంతరించుకుంది. బిజెపిలో చేరుతారన్న అనుమానాలను మరింత బలపరిచింది. అయితే ఈరోజు తిరుపతి తో పాటు హైదరాబాద్, బెంగళూరు నివాసాల్లోను సోదాలు జరుగుతున్నాయి.వైయస్ జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి. అప్పట్లో మద్యం లావాదేవీలు అన్ని మిథున్ రెడ్డి చూసేవారని టాక్ ఉంది. వైసీపీ హయాంలో ప్రతి శనివారం తాడేపల్లికి వచ్చి.. లిక్కర్ లెక్కలు చెప్పేవారని వైసీపీలోని ప్రచారం సాగుతోంది. ఈ విషయాన్ని వైసిపి నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తుంటారు కూడా. అయితే మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు తో సమానంగా.. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కమీషన్ల రూపంలో ఎక్కువగా వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

అయితే ఇటీవల పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కోర్టులో బెయిల్ లభించింది. అయితే చంద్రబాబుతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒప్పందం చేసుకున్నారన్న అనుమానాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వినిపించాయి. అందుకే చాలా రకాల కేసుల్లో పెద్దిరెడ్డికి మినహాయింపు లభించింది అన్న కామెంట్స్ ఉన్నాయి. పైగా ఎన్నికల సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తుడుచుపెట్టుకుపోయింది. అటువంటి సమయంలో పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులందరూ గెలిచారు. ఇలా గెలవడం వెనుక మ్యాచ్ ఫిక్సింగ్ ఉందన్న అనుమానాలు జగన్మోహన్ రెడ్డిలో బలంగా పెరిగాయి. ఆ కారణం చేతనే తాజాగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని దూరం పెట్టారన్న టాక్ వినిపిస్తోంది. ప్రధానంగా పెద్దిరెడ్డి కి చెందిన పి ఎల్ ఆర్ కంపెనీల ద్వారానే మద్యం కుంభకోణంలో లభించిన బ్లాక్ మనీని.. వైట్ గా మార్చారన్న అనుమానాలు ఉన్నాయి. ఆ అనుమానం తోనే పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పై కేసు నమోదు చేసింది ప్రత్యేక దర్యాప్తు బృందం. అయితే పిఎల్ఆర్ కంపెనీల ద్వారా జరిగిన లావాదేవీల విషయంలో సిట్ పట్టు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. అది తెలిసి జగన్మోహన్ రెడ్డి తన వరకు వస్తుందన్న



అనుమానంతోనే పెద్దిరెడ్డి కుటుంబాన్ని సైడ్ చేసినట్లు ప్రచారం సాగుతోంది. మొత్తానికైతే ఎంపీ మిథున్ రెడ్డి ని టార్గెట్ చేసుకొని సిట్ దర్యాప్తు చేస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**మద్యం మలుపులు**

కల్తీ మద్యం కేసులో అనేక ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడైన జనార్ధన్ రావు విడుదల చేసిన వీడియో పై వైసీపీ సోషల్ మీడియాలో అనేక ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జనార్ధన్ రావు చేత తప్పుడు స్టేట్ మెంట్ ఇప్పించారంటూ వైసీపీ నేతలు నేరుగానే విమర్శలు చేస్తున్నారు. కల్తీ మద్యం కేసును వైసీపీ మెడకు చుట్టాలన్న ప్రయత్నంలో చేసిన హడావిడిలో అసలు విషయాలను మర్చిపోయి వ్యవహరించారన్నది వైసీపీ నేతలు ఘాటుగానే విమర్శలు చేస్తున్నారు. జనార్ధన్ రావు వీడియోలో తనకు మాజీ మంత్రి జోగి రమేష్ చెబితేనే తాను కల్తీమద్యం ప్లాంట్ ను ములకలచెరువులో పెట్టానని అన్నారు. అప్పుడే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంపై బురద జల్లేందుకు వీలవుతుందని ఆయన తెలిపారు. అయితే జనార్ధన్ రావు ఆఫ్రికాలో ఉన్న సమయంలో ఒక వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో కూడా కల్తీ మద్యం కేసులో టీడీపీ నేతలకు సంబంధం లేదని చెప్పి సంకేతాలిచ్చారని, ఆ తర్వాతనే జనార్ధన్ రావును విదేశాల నుంచి రావాలని చెప్పడంతో ఆయన వచ్చాడని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. నిజానికి జోగి రమేష్ కు అత్యంత సన్నిహిత మిత్రుడైతే జనార్ధన్ రావు విదేశాల నుంచి రాకూడదని, కానీ తానే వచ్చి .. అంతే కాకుండా తాను వస్తున్న సమాచారాన్ని కూడా ఎక్సైజ్ పోలీసులకు ఇచ్చి గన్నవరం ఎయిర్ పోర్టులో అరెస్ట్ కావడం వెనక పెద్ద కుట్ర జరిగిందన్నది వైసీపీ నేతల ప్రధాన ఆరోపణ. కల్తీ మద్యం కేసులో జనార్ధన్ రావును పక్కనపెడితే అదే కేసులో ఉన్న జయచంద్రారెడ్డితో పాటు మరికొందరు నేతలు టీడీపీకి చెందిన వారేనని వైసీపీ నేతలు అంటున్నారు. వైసీపీ నేతలు సీబీఐ విచారణ కోరటం వెనక కొన్నేళ్ల పాటు కేసు విచారణలో తాత్సారం చేయడానికేనని చంద్రబాబు ప్రకటించిన గంటల్లోనే జనార్ధన్ రావు వీడియో విడుదల కావడం కూడా తమకు అనుమానంగా ఉందని అంటున్నారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం పై తమకు నమ్మకంలేదంటున్న వైసీపీ నేతలు ఈ కేసులో నిజానిజాలు వెలుగులోకి రావాలంటే సీబీఐకి అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం విచారణ పారదర్శకంగానే సాగుతుందని ఇందులో ఎలాంటి వివక్ష ఉండదని, రాజకీయ కుట్ర బయటపడుతుందన్న కారణంతోనే వైసీపీ నేతలు ఇలా మాట్లాడుతున్నారని టీడీపీ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. మొత్తం మీద ములకల చెరువు కల్తీ మద్యం కేసులో ఎప్పుడు ఏ రకమైన ట్విస్ట్ చోటు చేసుకుంటుందన్నది మాత్రం ఆసక్తికరంగానే మారింది.

# మహిళా కోచ్ లో మగాళ్ళను ఎలా అనుమతిస్తారు..?

**రైలు ప్రయాణీకురాలిపై అత్యాచార ఘటన బాధాకరం**

**గుంటూరు-పెదకూరపాడు స్టేషన్ల మధ్య ఘటనపై స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ**

**అమరావతి పెన్ పవర్:** :రైళ్ళల్లో మహిళలకు కేటాయించిన కోచ్ లలో మగాళ్ళను ఎలా అనుతిస్తారని ఏపీ మహిళా కమిషన్ డాక్టర్ రాయపాటి శైలజ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సంత్రగాచి స్పెషల్ రైలులో ప్రయాణిస్తున్న మహిళా ప్యాసింజర్ పైగుంటూరు, పెదకూరపాడు రైల్వే స్టేషన్ల మధ్య జరిగిన అత్యాచార ఘటనపై బుధవారం ఆమె స్పందించారు. ఘటన చాలా బాధాకరమన్నారు. ఈమేరకు ఘటన పూర్వాపరాలను గుంటూరు ఆర్పీఎఫ్ అధికారులతోమాట్లాడి చర్యలనిమిత్తం మహిళా కమిషన్ అధికారులను ఆమె ఆదేశించారు. దీంతో కార్యాలయ అధికారులు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తో ఫోన్ లో సంప్రదించగా.. ఓ మహిళ రాజమహేంద్రవరంలో సంత్రగచి ప్రత్యేక ఎక్స్ప్రెస్ట్రైన్లో చెర్లపల్లి దాకా ప్రయాణించడానికి ఎక్కగా.. ట్రైన్ గుంటూరు స్టేషన్లో ఆగిన సమయంలో, 40 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి మహిళా కోచ్లోకి ప్రవేశించాడని.. ఆగంతకుడు మహిళను కత్తితో బెదిరించిఅత్యాచారానికి పాల్పడినట్లు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు అందిందన్నారు. బాధితురాలి వద్దనున్న నగదు (రూ.5600) మరియు మొబైల్ ను దోచుకున్నట్లు ..పెదకూరపాడు స్టేషన్ దగ్గర రైలులోంచి దూకిపరారైనట్లు బాధితురాలు ఫిర్యాదిచ్చినట్లు చెప్పారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేసి, కేసును నడికుడి పోలీస్ స్టేషన్కు బదిలీ చేసినట్లు తెలిపారు.నిందితుడిని పట్టుకోవడానికి పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టాయని.. బాధితురాలు చెబుతున్న ప్రకారం గుంటూరు, పెదకూరపాడు రైల్వేస్టేషన్ ల మధ్య మొబైల్ ట్రాక్ లోకేషన్లు, సీసీ ఫుటేజీలు, ఇతర సాంకేతికతద్వారా నిందితుడ్ని పట్టుకునేందుకు చర్యలు చేపట్టామని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు చెప్పారు.డీఆర్ఎం, ఆర్పీఎఫ్ ఎస్పీలకు లేఖలు:

తక్షణమే ఈ కేసుపై వేగవంతమైన దర్యాప్తును ప్రారంభించి నేరస్తుడిని అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులను కోరారు.ఈమేరకు గుంటూరు రైల్వేస్టేషన్ డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం)కు, విజయవాడ రైల్వే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఎస్పీ), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే సెక్యూరిటీ ఫోర్స్, గుంటూరు వారికి మహిళా కమిషన్ద్వారా బుధవారం లేఖలు పంపారు. మహిళా ప్రయాణికుల భద్రతను నిర్ధారించే చర్యలు వేగవంతం చేయాలన్నారు. మహిళా కంపార్ట్మెంట్లో మహిళా కానిస్టేబుళ్లను డ్యూటీకి నియమించాలని, మహిళల కోచ్ లలోప్రయాణించడానికి ప్రయత్నించకుండా పురుషులను నిరోధించడానికి ఆర్పీఎఫ్ ద

క్రమం తప్పకుండా డ్రైవ్లను నిర్వహించాలని కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ కోరారు. రైళ్లలో ప్రయాణీకులకు సంబంధించిన భద్రతాలోపాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి చర్యలు చేపట్టాలన్నారు. ఒంటరి మహిళా ప్రయాణీకుల భద్రతపై మరింత నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. సంత్రగాచి స్పెషల్ ఎక్స్ప్రెస్ లో జరిగిన ఘటనపై పూర్తి దర్యాప్తు అనంతరం

కమిషన్ కు నివేదిక పంపాలని లేఖలో ఆమె కోరారు.

# మల్లోజుల ఆయుధం ఎందుకు వదిలారు

**ముంబై, అక్టోబరు 16, పెన్ పవర్:**
మావోయిస్టు విప్లవోద్యమ చరిత్రలో దాదాపుగా ఒక శకం ముగిసినట్టే. మావోయిస్టు దళంలో కీలక నాయకుడిగా పని చేసిన మల్లోజుల వేణుగోపాల్ రావు ఆయుధాన్ని పక్కన పెట్టారు. ఇన్ని రోజులపాటు అడవిలో అన్నగా వెలుగొంది న అతడు ఇకపై జనజీవన స్రవంతిలో కనిపించబోతున్నాడు. దశాబ్దాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్ గడ్, బీహార్ రాష్ట్రాలలోని అటవీ ప్రాంతాలలో తలదాచుకుని.. సమాంతర ప్రభుత్వాలు నిర్వహించిన అతడు.. ఇకపై సెలవంటూ ఆయుధాన్ని వదిలిపెట్టాడు. ఉద్యమం ఎక్కడుందో.. అక్కడే నీ కూడు ఉందని నినాదాలు చేసిన అతడు.. ఇప్పుడు జనజీవన స్రవంతిలో కలిసిపోయాడు.మల్లోజుల వేణుగోపాలరావు దాదాపు 40 సంవత్సరాలపాటు పోరాటం చేశాడు. దట్టమైన అడవులను కేంద్రంగా చేసుకొని ఉద్యమాలు చేశాడు. ఎన్నో హింసాత్మక ఘటనలలో పాలుపంచుకున్నాడు. సాధారణ మావోయిస్టుగా దళంలోకి ప్రవేశించిన అతడు దినదిన ప్రవర్తమానంగా ఎదిగాడు. ఏకంగా కేంద్ర కమిటీ ని శాసించే స్థాయికి ఎదిగాడు. 1981లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన అతడు ఏటూరు నాగారం దళసభ్యుడిగా ఆయుధాన్ని చేత పట్టుకున్నాడు. పార్టీలో అంతకంతకు విరిగిపోయాడు. 1983లో డికేస్ జడ్పీ సభ్యుడిగా.. 1995లో కేంద్ర కమిటీ సభ్యుడిగా.. 2005లో పొలిటి బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యాడు. గడచిన నాలుగు దశాబ్దల కాలంలో ఎన్నో హింసాత్మక ఘటనలలో పాలుపంచుకున్నాడు.. రాష్ట్ర పోలీసులకు, కేంద్ర దళాలకు కొరకరాని కొయ్యగా మారిపోయాడు.ఇటీవల కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఇందులో భాగంగా ఎంతోమంది మావోయిస్టులను అంతం చేసింది. దట్టమైన అడవులలో మావోయిస్టుల ఆనవాళ్లు లేకుండా చేస్తోంది. మావోయిస్టులకు పట్టు ఉన్న ప్రాంతాలలో కేంద్ర బలగాలు విస్తృతంగా దాడులు చేస్తున్న నేపథ్యంలో వారికి ఆవాసం అనేది లేకుండా పోయింది. దీంతో మావోయిస్టులు తుపాకులను పక్కన పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందువల్ల ఇటీవల హిడ్మా పేరుతో ఒక లేఖ విడుదలైంది. తుపాకులను వదిలిపెడతామని ఆ లేఖలో హిడ్మా పేర్కొన్నాడు. దీనిపై మావోయిస్టులలో భిన్న స్వరాలు వినిపించాయి. మావోయిస్టు సానుభూతిపరులు కూడా హిడ్మా లేఖను తప్పు పట్టారు. దీంతో మావోయిస్టులు తుపాకులను పక్కన పెట్టడం సాధ్యం కాదని అర్థమయిపోయింది. ఈ నేపథ్యంలోనే వేణుగోపాల్ రావు 60 మంది దళసభ్యులతో లొంగిపోతున్నట్టు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. . మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో వేణుగోపాలరావు తన 60 మంది దళ సభ్యులతో కలిసి లొంగి పోయారు. జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నట్టు ప్రకటించారు. దీంతో మావోయిస్టు ఉద్యమానికి ఎదురు దెబ్బ తగిలినట్టు అయింది. ఈ క్రమంలోనే మావోయిస్టులు ఇకపై జనజీవన స్రవంతిలో కలుస్తారని తెలుస్తోంది. కేంద్రం కూడా మావోయిస్టులతో శాంతి చర్చల ప్రసక్తి లేదని స్పష్టం చేసింది. అటు కేంద్ర బలగాలు ముప్పేట దాడి చేస్తున్న నేపథ్యంలో ఊపిరి ఆడని పరిస్థితి మావోయిస్టులకు ఏర్పడింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మావోయిస్టులు తుపాకులను పక్కన పెడుతున్నారు. వేణుగోపాలరావు జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత.. ప్రజా సమస్యల పరిష్కారానికి వేరే విధమైన ఉద్యమాలను చేపడతామని పేర్కొన్నారు. కాకపోతే అది శాంతియుత విధానంలో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# ప్రశాంత్ అస్త్ర సన్యాసం



**పాట్నా అక్టోబరు 16, పెన్ పవర్:** :ప్రశాంత్ కిశోర్.. తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమైన పేరే.. ముద్దుగా పీకేగా పిలుచుకునే ఇతను మాజీ ఎన్నికల స్ట్రాటజిస్టు. 2014లో కేంద్రంలో బీజేపీ గెలవడానికి, తెలంగాణలో బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ గెలవడానికి పనిచేశారు. 2019లో ఆంధ్రప్రదేశ్లో వైసీపీని గెలిపించారు. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల తరపున పనిచేశారు. అయితే ఇప్పుడు బిహార్లో సొంత పార్టీ పెట్టారు. జన్సురాజ్ పార్టీ పేరుతో మూడేళ్ల క్రితమే పార్టీని ప్రారంభించారు. అయితే ఎన్నికల వ్యూహకర్త అయిన పీకే.. బిహార్లో ఇప్పుడు తన పార్టీ గెలుపును మాత్రం అంచనా వేయలేకపోతున్నారు. ఒంటరిగా అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగిన పీకే.. తాను మాత్రం ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించారు.ప్రశాంత్ కిశోర్ రాఘోపూర్, కర్గాహర్ నియోజకవర్గాల్లో ఏదో ఒకస్థానం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ ఆయా స్థానాల్లో చంచల్ సింగ్, రితేష్ రంజన్ పాండేను జన్ సురాజ్ పార్టీ అభ్యర్థులుగా ప్రకటించారు. దీంతో ఆయన పోటీ చేయరని స్పష్టమైంది.దగ్గుబాటి, ప్రసారం వంటి ప్రముఖ ప్రభుత్వ విద్యార్థులు, కార్యకర్తల ఆధారంగా తిరువనంతపురంను బలపరిచేందుకు ప్రశాంత్ కిశోర్ ప్రయత్నిస్తుండడం రాజకీయ వ్యూహం యొక్క కీలకమయిన అంశమని అభిప్రాయ వ్యతిరేకులు పేర్కొంటున్నారు. ఎన్డీయే కూటమి ఈ ఎన్నికల్లో ఘోరమైన ఓటమి భవిష్యత్తును ఎదుర్కోవాల్సి ఉందన్న ధీమా ఆయన వ్యక్తం చేశారు. జన్ సురాజ్ పార్టీ ప్రధాన లక్ష్యం ఆరు రాష్ట్రాల్లో 150 స్థానాలకు పైగా సాధించడం. ఒక సీటు కూడా తగ్గితే విజయం లేనిట్టేనని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమూహాల ప్రతినిధిత్వానికి ప్రాధాన్యత కల్పించారు, అందులో అతి పిన్న వర్గాలు, మైనారిటీలు, యువత ప్రాముఖ్యత పొందాయి. ప్రశాంత్ కిశోర్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తూనే నాయకత్వంలో వ్యూహాత్మక మార్గదర్శకుడిగా వ్యవహరిస్తామని తెలుస్తోంది. ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనకపోయినా, జన్ సురాజ్ పార్టీని బలపరచడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ స్థితిగతులు బిహార్ రాజకీయ వేదికపై జన సురాజ్ పార్టీకి కొత్త మైలురాయిగా నిలుస్తాయి.

# దుమ్ము రేపుతున్న కాంతారా

**హైదరాబాద్, అక్టోబరు 16, పెన్ పవర్:** ఈమధ్య కాలం లో భారీ అంచనాల మధ్య విడుదలై మొదటి ఆట నుండే తిరుగులేని పాజిటివ్ టాక్ తెచ్చుకున్న సినిమా ఏదైనా ఉందా అంటే అది 'కాంతారా : చాప్టర్ 1ః. ఆ టాక్ కి తగ్గట్టే భారీ ఓపెనింగ్స్ అయితే వచ్చాయి కానీ, ఓపెనింగ్ వీకెండ్ తర్వాత వసూళ్లు దారుణంగా పడిపోయాయి అనేది వాస్తవం. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా పూర్తి స్థాయి లో బ్రేక్ ఈవెన్ మార్కుని దాటి సూపర్ హిట్ అవ్వాలంటే కచ్చితంగా 1200 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను రాబట్టాల్సిందే. అడ్వాన్స్ బేసిస్ మీద అంత వసూళ్లు రాకపోయినా,కనీసం 900 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను అయితే ఈ చిత్రం రాబట్టాలి. కానీ ఆ పరిస్థితులు ప్రస్తుతానికి అసలు కనిపించడం లేదు. ఇక తెలుగు వెర్షన్ లో అయితే ఈ చిత్రం డిజాస్టర్ ఫలితాన్ని సొంతం చేసుకుంది అనే చెప్పాలి.మొత్తం మీద ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాకు వచ్చిన వసూళ్లను పరిశీలిస్తే, అన్ని భాషలకు కలుపుకొని 645 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టింది. ప్రాంతాల వారీగా వచ్చిన వసూళ్లను ఒకసారి పరిశీలిస్తే కర్ణాటక ప్రాంతం నుండి 175 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను రాబట్టిన ఈ సినిమా, తెలుగు రాష్ట్రాల నుండి 94 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. ఆ తర్వాత తమిళనాడు నుండి 50 కోట్ల రూపాయిలు, కేరళ నుండి 45 కోట్ల రూపాయిలు, హిందీ ం రెస్ట్ ఆఫ్ ఇండియా నుండి 180 కోట్లు, ఓవర్సీస్ మార్కెట్ నుండి 100 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. మొత్తం మీద షేర్ ని లెక్కగడితే 316 కోట్ల రూపాయిలు వచ్చిందట.తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాని 91 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసారట . ఇప్పటి వరకు ఈ చిత్రానికి 60 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లు మాత్రమే వచ్చింది. బ్రేక్ ఈవెన్ మార్కుని దాటాలంటే 31 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లను రాబట్టాలి. తెలుగు రాష్ట్రాల నుండి 13 వ రోజున ఈ చిత్రానికి వచ్చిన వసూళ్లు 60 లక్షల రూపాయిల షేర్ మాత్రమే. ఇంత తక్కువ షేర్స్ వస్తే బ్రేక్ ఈవెన్ మార్కుని అందుకోవడానికి ఎన్నేళ్లు పడుతుంది?, కాబట్టి కమర్షియల్ గా ఈ సినిమా అన్ని భాషల్లోనూ డిజాస్టర్ ఫ్లాప్ అనే చెప్పాలి. ఇక దీపావళి కి అన్ని భాషల్లోను సినిమాలు ఉన్నాయి. ఒక్క టాలీవుడ్ నుండే నాలుగు సినిమాలు వస్తాయి. కాబట్టి కాంతారా థియేటర్స్ భారీగా తగ్గిపోతాయి. కాబట్టి ఇక తెలుగు రాష్ట్రాల నుండి రెండు మూడు కోట్ల రూపాయిల షేర్ కి మించి ఊహించలేం. కాబట్టి కమర్షియల్ గా ఒక పెద్ద ఫెయిల్యూర్ అని చెప్పొచ్చు.

# పాకిస్తాన్ కు ఓ వైపు.. అమెరికా..మరో వైపు చైనా



**హైదరాబాద్, అక్టోబరు 16, పెన్ పవర్:** యుద్ధం జరిగిన ప్రతీసారి భారత్ చేతిలో చావుదెబ్బతింటోంది మన దాయాది దేశం. యుద్ధంలోనే కాదు క్రికెట్లోనూ అదే పరిస్థితి. వాపును చూపుకుని బలుపుగా భావిస్తూ భారత్తో కయ్యానికి కాలుదువ్వుతుంది.. దెబ్బ కొట్టగానే కాళ్ల బేరానికి వస్తోంది. ఇటీవల ఆపరేషన్ సిందూర్ దెబ్బకు ఎయిర్ బేస్లకు ప్యాచ్ వర్క్ చేసుకుంటున్న పాకిస్తాన్కు ట్రంప్ అండగా నిలిచారు. మొన్నటి వరకు చైనా అండ చూసుకుని ఎగిరెగిరి పడిన పాకిస్తాన్.. ఇప్పుడు అమెరికా అండతో భారత్పై రివేంజ్ తీసుకోవాలని భావిస్తోంది.పాకిస్తాన్ ఇప్పటివరకు చైనా మద్దతుతో నిలబడింది. అయితే 2025లో, పాక్ కొత్త వ్యూహంగా అమెరికా చేతితో డీల్ చేసేందుకు యత్నిస్తున్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీన్ని సుదీర్ఘ కాలంగా మాదిరిగా భావించి, అమెరికా కూడా పాకిస్థాన్ వ్యూహాల్లో మరింత పలకరించటం కనిపిస్తోంది. అయితే, అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ మామూలోడు కాదని, అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకునే వ్యక్తి కాబట్టి, పాక్ మరోసారి తప్పుకోకపోతుందని భావిస్తున్నారు.పాక్ చైనాతో కూడిన ఒప్పందాలు, ఆర్థిక సహకారాలు పెద్ద మొత్తంలో ఉన్నా, పాకిస్తాన్ అంతర్గతంగా సవాళ్లు ఎదుర్కొంటుంది. పెరిగిన అప్పులు, రాజకీయ అస్థిరతలు తలనొప్పులుగా మారాయి. అందువల్ల, పాక్ అల్టర్నేటివ్ మద్దతుల కోసం అమెరికాను కోరుతోంది. అయితే, అమెరికా%–%పాక్ డీల్ లో అమెరికా దృష్టి మరింత కఠినపడి, పాక్ ప్రవర్తనపై కట్టుదిట్టం పెరిగే అవకాశాలు ఉన్నాయి, అంటే పాక్ ఈసారి మరల పొరపాటు చేయటం దీర్ఘకాలంలో దుష్పరిణామాలు కలుగజేయవచ్చు.పాకిస్తాన్ వ్యూహాలు భారత భద్రతా విశ్లేషకులకు పెద్ద సవాలు. ప్రస్తుతం, పాక్%–%చైనా సంబంధాల మధ్య తాత్కాలిక మార్పులు వస్తున్నప్పటికీ, ఇండియా కీలక కారణంగా మిగిలి ఉంటుందని అంచనా. భారతం తన భద్రతా పథకాలను మరింత గట్టి చేస్తూ, అంతర్జాతీయ మైదానంలో కొత్త చట్టాలు, దృఢత చూపించాల్సి ఉంటుంది. ట్రంప్ మాదిరి కట్టుదిట్ట నేత నేతృత్వం కారణంగా, అమెరికా%–%భారత్%–%ఇతర మైత్రి సంబంధాలు పాకిస్తాన్ వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కీలకం అవుతాయి.పాక్%–%భారత్ మధ్య భవిష్యత్ గణనీయమైన మార్పులు చూస్తామని సూచిస్తున్నారు. పాక్ ఇప్పుడు అమెరికా చేతితో ప్రయోగాలు చేస్తుండగా, భారత్ దీన్ని గమనించి సహజ ప్రతిస్పందన చర్యలను పలు మెలకువలతో చేర్పించాల్సి వస్తుంది.

## పరకాల లక్ష్యం ఏమిటీ

**విజయవాడ, అక్టోబరు 16 పెన్ పవర్:** ఒకప్పుడు చంద్రబాబుకు అత్యంత నమ్మకమైన మిత్రుడిగా ఉన్న పరకాల ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కలిగిస్తున్నాయి. 2014 లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత పరకాల ప్రభాకర్ చంద్రబాబు ప్రభుత్వంలో కీలకంగానే ఉన్నారు. సలహాదారుగా పనిచేశారు. తర్వాత ఆయన ఇక రాజకీయాలకు దూరమయ్యారు. కేవలం అప్పుడప్పుడు విశ్లేషణలు మాత్రమే చేస్తున్నారు. పరకాల ప్రభాకర్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భర్త. హైదరాబాద్ లో ఉన్న పరకాల ప్రభాకర్ ఒక యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. అదీ గత ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను ఆయన ఎత్తి చూపారు. 2024 లో జరిగిన ఎన్నికల్లో దేశంలో ఐదు కోట్ల ఓట్లు అదనంగా లెక్కింపులో రావడం జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా 174 నియోజకవర్గాల్లో ఓట్ల శాతం పోల్ అయిన దానికంటే పెరిగితే మిగిలిన చోట్ల ఓట్ల శాతం తగ్గిందంటూ పరకాల అన్నారు. గత ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా పోలయిన ఓట్ల కటే ఐదు కోట్ల ఓట్లు లెక్కింపులో అదనంగా వచ్చాయని ఆయన చెప్పడం మాట అటుంచితే ఆయన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల విషయాలను కూడా ప్రస్తావించారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో 49 లక్షల ఓట్లు అదనంగా కౌంటింగ్ లోకి రావడాన్ని పరకాల ప్రభాకర్ చెప్పడం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. అందుకే గెలిచే వాళ్లు ఓడిపోయారు.. ఓడిపోయే వాళ్లు గెలిచారంటూ కామెంట్స్ చేశారు.గత ఎన్నికల్లో వైసీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. కూటమిలో ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేనలకు అధికారం దక్కింది. ఈవీఎంలో జరిగిన లోపాల వల్లనే తమకు అన్యాయం జరిగిందంటూ ఎన్నికల ఫలితాల తర్వాత వైసీపీ పదే పదే ఆరోపణలు చేస్తుంది. ఒంగోలులో పోటీ చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి సయితం న్యాయస్థానాన్ని ఆశ్రయించి తిరిగి లెక్కించాలని కోరారు. వైసీపీ నేతలకు కేవలం పదకొండు సీట్లకు మాత్రమే పరిమితం కావడంతో వారు విమర్శలకు దిగారు. ఇప్పుడు చంద్రబాబుకు ఒకనాడు సన్నిహితంగా ఉన్న పరకాల ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలతో మరోసారి ఈ విషయం టాపిక్ గా మారింది. పరకాల ప్రభాకర్ వద్ద ఏ ఆధారాలున్నాయన్నది మాత్రం ఆయన స్పష్టంగా చెప్పకపోవడం విశేషం. ఫలితాలు తారుమారు కావడానికి అధిక ఓట్లు పోలవ్వడమే కారణమని పరకాల వ్యాఖ్యలలో నిజమెంత అన్నది తేలాల్సి ఉంది.

## వైసీపీకి ఏమైంది...



**విజయవాడ, అక్టోబరు 16, ( పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అసలు ఏం జరుగుతోంది? ఆ పార్టీ గత వైభవం దిశగా అడుగులు వేసే పరిస్థితి ఉందా? 2029 ఎన్నికల్లో సత్తా చాటే పరిస్థితి ఉందా? అసలు ఆ పార్టీలో ఏం జరుగుతోంది? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ ప్రతిపక్షానికి పరిమితం అయింది. కానీ అనతి కాలంలోనే అధికార టిడిపికి చుక్కలు చూపించింది. కానీ ఇప్పుడు ఎందుకు ఆ పరిస్థితి లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విఫలమైందా? లేకుంటే టీడీపీ కూటమి ప్రభుత్వం గుణపాఠం నేర్చుకుందా? దీనిపై బలమైన చర్చ నడుస్తోంది. అయితే అప్పటికి ఇప్పటికీ కేంద్రం వైఖరి మారింది. అదే తెలుగుదేశం కూటమికి ప్లస్సు అయ్యింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైనస్ గా పరిణమించింది.2014లో ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉంది తెలుగుదేశం పార్టీ. అంతకుముందు బిజెపి వాజ్పేయి నేతృత్వంలో ఉండేది. ఆ తరువాత స్థానం లాల్ కృష్ణ అద్వానీ అలియాస్ ఎల్కే అద్వానీ ఉండేది. అప్పటికే చంద్రబాబు చతురత పనిచేసేది. మిగతా నేతలతో పోల్చుకుంటే చంద్రబాబు సీనియర్ కూడా. వయసు రీత్యా అటల్ బిహారీ వాజ్పేయి సీనియర్ కానీ.. క్షేత్రస్థాయిలోకి వచ్చేసరికి చంద్రబాబు అప్పటికే తనకు తాను నిరూపించుకున్నారు. ముఖ్యంగా నందమూరి తారక రామారావును అధికారానికి దూరం చేసి తాను సొంతం చేసుకున్నారు. అంతటి ప్రతికూల పరిస్థితుల్లో సైతం 1999 ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో గెలిచారు. అందుకే చంద్రబాబుకు వాజ్పేయి తో పాటు ఎల్కే అద్వానీ ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. కానీ 2014లో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ మరోసారి ఎన్డీఏకు దగ్గరయింది కానీ.. మునుపటి బిజెపి పెద్దల మాదిరిగా చంద్రబాబును నమ్మే స్థితి లేదు. దాని పర్యవసానం అనుభవించారు చంద్రబాబు. దాని నుంచి గుణపాఠాలు నేర్చుకుని 2024 ఎన్నికల్లో సర్వశక్తులు ఒడ్డి బిజెపిని తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు చంద్రబాబు. అలా మూడు పార్టీల కలయికతో అద్భుత విజయం సొంతం చేసుకున్నారు.అయితే గత పరిస్థితుల దృష్ట్యా పవన్ కళ్యాణ్ బలమైన మద్దతుదారుడుగా మార్చుకున్నారు చంద్రబాబు. తద్వారా భారతీయ జనతా పార్టీని సైతం తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఎందుకంటే ఒక జాతీయ పార్టీగా మూడుసార్లు అధికారంలోకి వచ్చిన పార్టీకి ప్రజా వ్యతిరేకత అనేది సర్వసాధారణం. అదే సమయంలో మిత్రుల ద్వారా బలపడాలన్నది బిజెపి వ్యూహం. ఆ పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో పరిమితంగా ఉంది మిత్రపక్షాల పాత్ర. అదే సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా పక్షం పెద్ద ప్రాంతీయ పార్టీలతో బలంగా ఉంది. అదే ఎన్డీఏ విషయంలో బిజెపి తర్వాత పెద్ద పార్టీగా టిడిపి ఉంది. అటు తరువాత నితీష్ నేతృత్వంలోని జెడియు, అకాలి దళ్, ఆపై దేవే గౌడ జెడిఎస్ ఉంది. అయితే ఉన్నంతలో తెలుగుదేశం పార్టీ సీనియర్. ఆపై చంద్రబాబు జాతీయస్థాయిలో మంచి నాయకుడు. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీకి భారతీయ జనతా పార్టీ అధిక ప్రాధాన్యం ఇస్తూ వస్తోంది.అయితే బిజెపికి సిద్ధాంతపరంగా వ్యతిరేక పార్టీ వైయస్సార్ కాంగ్రెస్. ఆ పార్టీ పరోక్ష మద్దతు కే తప్ప.. ప్రత్యక్షంగా ఇచ్చే మద్దతుకు ప్రజలు హర్షించరు. ఆ విషయం బిజెపికి తెలుసు. అందుకే ఆ పార్టీని దూరంగా పెడుతోంది కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి. కానీ జగన్మోహన్ రెడ్డి తన వ్యక్తిగత అవసరాల దృష్ట్యా భారతీయ జనతా పార్టీతో మమేకం అయ్యేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అది పొలిటికల్ గా చాలా డ్యామేజ్ చేస్తోంది. 2014లో బలమైన ప్రతిపక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ ఉంది. 2019లో ఏకపక్షంగా అధికారాన్ని సొంతం చేసుకుంది. 2024లో డిజాస్టర్ ఫలితాలను చవిచూసింది. అయినా సరే ఆ పార్టీ ఎందుకో ఇంకా బీజేపీ అంటూ జపం చేస్తోంది. అది ఎంత మాత్రం నష్టం తప్ప లాభం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరిలో మాత్రం మార్పు రావడం లేదు.

## కొండకు ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి..
## భారీగా ట్రాఫిక్ జామ్



**పెన్ పవర్:** ప్రకాశం జిల్లా గిద్దలూరు టు నంద్యాల హైవే ఘాటు రోడ్డులో కర్నూలు నుండి విజయవాడకు టీజీ వెంకటేష్ ఫ్యాక్టరీ నుండి కెమికల్ లోడుతో లారీ విజయవాడ బయలుదేరి వస్తుండగా గిద్దలూరు ఘాట్ రోడ్డు నందుమలుపు వద్ద గురువారం తెల్లవారం తెల్లవారుజామున లారీ అదుపుతప్పి కొండకు ఢీకొట్టింది. ఘటనలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ రోడ్డు కు అడ్డంగా నిలిచిపోయింది .గిద్దలూరు టు నంద్యాల కు వాహనాలు పోవడానికి వీలు లేకుండా లారీ ఉండడంతో సుమారు ఒక కిలోమీటర్ మేరకు వాహనాలు నంద్యాల వైపు గిద్దలూరు వైపు నిలిచిపోయాయి.

# పరకామణి పాపం ఎవరిది...

**తిరుమల, అక్టోబరు 16 పెన్ పవర్:**
దేవ దేవుడి సన్నిధి. ఏడు కొండల వాడి ఖజానా. శేషాద్రివాసుడి హుండీ లెక్కించే అవకాశమే అదృష్టం. కానీ అందులో కూడా చేతివాటం ప్రదర్శించి పాపం అంటగట్టుకున్నారు కొందరు. తిరుమల తిరుపతి దేవస్థానం పరికామణి విభాగంలో జరిగిన దొంగతనం కేసు మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చింది. అప్పటి ఉద్యోగి రవికుమార్ 920 డాలర్లు కొట్టేశారని టీటీడీ విజిలెన్స్ అధికారులు ఏప్రిల్ 2023లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో లోక్ అదాలత్ ముందు రవికుమార్‌తో రాజీ కుదిరింది.ఈ రాజీ నిర్ణయం చట్టపరంగా ఎంతవరకు కరెక్ట్ అన్న వివాదం మొదలైంది. ఈ చోరీపై పూర్తిస్థాయి దర్యాప్తు జరగలేదని..ఓ జర్నలిస్టు హైకోర్టులో పిటిషన్ వేయడంతో మళ్లీ చర్చ స్టార్ట్ అయింది. పరకామణి చోరీ కేసుకు సంబంధించి..ఖజానా రికార్డులు, రాజీ ఒప్పంద పత్రాలు సీజ్ చేయాలని హైకోర్టు సూచించింది. అయితే పోలీస్ అధికారులు కోర్టు ఆదేశాలను పాటించలేదని లేటెస్ట్‌గా న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏకంగా పోలీస్ స్టేషన్లనే మూసివేయండి అంటూ ఘాటుగా స్పందించింది. దీంతో వెంటనే సీఐడీ అధికారులు రంగంలోకి దిగారు. పరకామణి కేసుకు సంబంధించి టీటీడీ పాలక మండలి తీర్మానాలు.. లోక్ అదాలత్‌లో రాజీ చేసిన ఫైల్స్ అన్ని పరిశీలించారు సీఐడీ అధికారులు. ఆ డాక్యుమెంట్స్ అన్నీ సీజ్ చేశారు. సీసీ పుటేజీను కూడా పరిశీలిస్తున్నామని అధికారులు చెప్తున్నారు. పరకామణి చోరీ కేసు నమోదైన తిరుమల వన్ టౌన్ పీఎస్‌లో రికార్డుల పరిశీలించారు.లోక్ అదాలత్‌లో రాజీ తర్వాత..పరకామణి లెక్కింపులో చోరీ చేసిన రవికుమార్..టీటీడీకి రూ.14 కోట్ల విలువైన ఆస్తులను విరాళంగా ఇచ్చినట్లు గుర్తించారు. అయితే రాజీ ద్వారా నిందితుడిపై చర్యలు నిలిపివేయడమే పెద్ద వివాదం అవుతోంది. ఈ విషయంపై ఇప్పటికే టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాశ్‌రెడ్డి ఈ మధ్యే ప్రెస్‌మీట్ పెట్టి మరీ అప్పటి టీటీడీ పెద్దలపై అలిగేషన్స్ చేశారు. స్వామివారి సొమ్మును స్వాహా చేస్తే చర్యలు తీసుకోకుండా..ప్రైవేటుగా సెటిల్ చేయడమేంటి..అలా చేయడానికి మీకు ఎవరు అధికారం ఇచ్చారని ప్రశ్నించారు.శ్రీవారి హుండీని దొంగతనం చేసిన రవికుమార్ అనే వ్యక్తిని కోర్టులో నిందితుడిగా ప్రవేశపెట్టకుండానే..లోక్ అదాలత్‌లో రాజీచేయడం, అతడు చోరీ చేస్తుండగా సీసీ పుటేజీకి చిక్కడం వంటి బలమైన ఆధారాలు ఉన్నా చర్యలు తీసుకోకపోవడంపై కూటమి పెద్దలు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.వంద కోట్ల వరకు శ్రీవారి హుండీ నుంచి దోచేశారని, 40 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను బినామీ పేర్లతో రాయించుకున్నారని..భూమన కరుణాకర్‌రెడ్డి టార్గెట్‌గా అలిగేషన్స్ చేస్తున్నారు కూటమి నేతలుఅ మధ్య టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి బయటపెట్టిన వీడియోతో తిరుమల వేదికగా రాజకీయం మరోసారి వేడెక్కింది. అయితే తన మీద వచ్చిన ఆరోపణలపై భూమన కరుణాకర్‌రెడ్డి కూడా సీరియస్‌గానే రియాక్ట్ అయ్యారు. తాను టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు పరకామణిలో దొంగతనం జరిగినట్లు నిరూపిస్తే తల నరుక్కుంటానని సవాల్ చేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే రవికుమార్ శ్రీవారి హుండీ లెక్కింపులో దొంగతనం చేశారని భూమన అంటున్నారు.రవికుమార్ కుటుంబ సభ్యులు పాప పరిహారంగా తమ ఆస్తులను టీటీడీకి రాసిచ్చారని చెప్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే పరకామణి చోరీ జరిగిందని..రవికుమార్ అనే వ్యక్తి వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని కూటమి ఆరోపిస్తోంది. ఒక ఉద్యోగి టీటీడీకి రూ.14కోట్లు రాసిచ్చారంటే..శ్రీవారి ఖజానా నుంచి ఎంత కొట్టేశారో అర్థం చేసుకోవచ్చంటున్నారు.పైగా రవికుమార్ నుంచి అప్పుడు టీటీడీలో కీలకంగా ఉన్న నేతలు ఆస్తులు రాయించుకున్నారని కూడా ఆరోపిస్తున్నారు. ఇప్పుడు సీఐడీ విచారణతో ఇది ఎవరికి మెడకు చుట్టుకుంటుందోనన్న టెన్షన్ మొదలైంది. ఇప్పటికే రోజుకో ఇష్యూ ఏపీ పాలిటిక్స్‌ను షేక్ చేస్తోంది. ఇప్పుడు పరకామణి ఎపిసోడ్ ఎటు దారితీయబోతోంతో..ఎవరెవరు బుక్ అవుతారో వేచి చూడాలి మరి.




# రెగ్యులర్ ఎపిసోడ్‌లాగా రుషికొండ భవనాలు

**విశాఖపట్టణం, అక్టోబరు 16 పెన్ పవర్:**
ఎన్నికలకు ముందు అదే రచ్చ. ఎన్నికలు అయిపోయి..15 నెలలు అవుతున్నా..ఆ భవనాల చుట్టే ఏపీ పాలిటిక్స్ చక్కర్లు కొడుతున్నాయి. ఆ కట్టడాలు వైసీపీకి చేయాల్సినంత డ్యామేజ్ చేశాయి. కూటమికి కావాల్సిన ప్లస్ పాయింట్‌గా మారాయి. అయినా ఇప్పటివరకు రుషికొండ భవనాలు రెగ్యులర్ ఎపిసోడ్‌లాగా ఉండిపోతున్నాయి. ప్రతీ నెల రోజులకోసారి ఏదో విధంగా సాగరతీరంలో వైసీపీ హయాంలో కొండను తవ్వేసి కట్టిన కట్టడాల మీదే డిస్కషన్ నడుస్తోంది.ఇప్పుడు మరోసారిలైమ్‌లైట్‌లోకి వచ్చేసింది రుషికొండ ఇష్యూ. విశాఖ సాగర తీరాన వైసీపీ హయాంలో కట్టిన రుషికొండ భవనాల రచ్చ క్లైమాక్స్‌కు చేరేలా కనిపిస్తోంది. సర్కార్ క్యాబినెట్ సబ్‌కమిటీ చర్చలు స్టార్ట్ చేయడంతో..రుషికొండ నిర్మాణాలను దేనికి యూజ్ చేస్తారనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. రుషికొండ భవనాలను ఏపీ సర్కార్ ఏం చేయబోతోంది?ప్రభుత్వమే వాడుకుంటుందా? రిసార్టులు, హోటల్స్ కోసం రెంట్‌కు ఇస్తారా? సబ్ కమిటీ సూచనలు ఎలా ఉండబోతున్నాయి? అనేది ఉత్కంఠ రేపుతోంది. ఇదంతా ఇలా ఉండగానే రుషికొండ భవనాలను మెంటల్ హాస్పిటల్‌గా మార్చాలని గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు వంటి వాళ్లు ప్రతిపాదించడం హాట్ టాపిక్ అవుతోంది.మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యి.. రుషికొండ భవనాలను ఏ విధంగా వినియోగించుకోవాలనే దానిపై చర్చించింది. ఎలాంటి ఉపయోగం లేకుండా ఉన్న రుషికొండ కట్టడాలతో నెలకు రూ.25 లక్షలు విద్యుత్ ఛార్జీలు, మెయింటనెన్స్ ఖర్చులు భరించాల్సి వస్తోందని చెబుతోంది ప్రభుత్వం. గతంలో రూ.7 కోట్లు ఆదాయం వచ్చే చోట ఇప్పుడు ప్రభుత్వం ఎదురు చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు మంత్రులు. రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ప్రజాభిప్రాయాలు కోరుతూ ప్రకటన ఇవ్వాలని, ప్రజల అభిప్రాయం ప్రకారం డెసిషన్ తీసుకోవాలి క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. హోటల్స్ నిర్వహణ, మానసిక వికలాంగుల చికిత్సాలయ ఏర్పాటు చేయాలంటూ వచ్చిన ప్రతిపాదనలు, సలహాలను మంత్రివర్గ ఉపసంఘం పరిశీలిస్తోందట. అయితే ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాతే రుషికొండ భవనాలపై ఓ నిర్ణయానికి రావాలని భావిస్తున్నారట.రుషికొండ భవనాలను విషయంలో కూటమి టార్గెట్‌గా వైసీపీ. జగన్ ఫ్యామిలీ సాగర తీరంలో సేద తీరేందుకు..అద్భుతమైన ప్యాలెస్ కట్టారని ముందు నుంచి ఆరోపిస్తూ వస్తోంది కూటమి. అందులో బాత్ టబ్‌లు, లైటింగ్ అరేంజ్‌మెంట్స్..సీ వ్యూ..అంతా జగన్ ఇష్ట ప్రకారం..అతని కుటుంబ సౌఖ్యం కోసం నిర్మించారని విమర్శిస్తున్నారు. ఈ అలిగేషన్స్‌ను తిప్పికొట్టడంతో వైసీపీ ఇప్పటికీ ఫెయిల్ అవుతూ వస్తూనే ఉంది.ఈ క్రమంలో అదే రుషికొండ భవనాలను అస్త్రంగా చేసుకుని జగన్‌ను, వైసీపీని సందర్భం దొరికినప్పుడల్లా ర్యాగింగ్ చేస్తున్నాయి కూటమి పార్టీలు. పైగా మెంటల్ హాస్పిటల్‌గా మారుస్తామన్న ప్రతిపాదనను తెరమీదకు తెచ్చి ఇండైరెక్టుగా జగన్‌ను టార్గెట్ చేస్తోంది. వైసీపీ హయాంలో తుగ్లక్ పాలన జరిగిందని..టీడీపీ, బీజేపీ, జనసేన మొదటి నుంచి విమర్శిస్తూ వస్తున్నాయ్. కానీ ఇది రాజకీయ విమర్శగానే భావించారు జనం. కానీ ఇప్పుడు రుషికొండ భవనాలను మెంటల్ హాస్పిటల్‌గా మారుస్తామన్న టాక్‌తో..మళ్లీ జగన్‌ను ర్యాగింగ్ చేస్తోంది కూటమి. రుషికొండ భవనాలపై ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉండబోతుందో..వైసీపీ రియాక్షన్ ఏంటో చూడాలి మరి.



# దేవినాని అవినాష్ కు కలిసి రాని కాలమేనా

**విజయవాడ, అక్టోబరు 16 పెన్ పవర్:** వైసీపీకి చెందిన యువనేత దేవినేని అవినాష్ ఈసారి నియోజకవర్గం మార్చబోతున్నారు. దేవినేని నెహ్రూ కుమారుడిగా రాజకీయాల్లోకి వచ్చిన దేవినేని అవినాష్ ఇప్పటి వరకూ చట్టసభల్లో అడుగు పెట్టలేదు. ఒకప్పుడు విజయవాడ రాజకీయాలను ఒక ఊపు ఊపిన దేవినేని కుటుంబం ఇప్పుడు గెలుపు కోసం పరితపించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దేవినేని నెహ్రూ విషయంలో అలా జరగలేదు. ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా అనేక పదవులు అనుభవించారు. దమ్మున్న నేతగా జనంలో ముద్ర పడ్డారు. కానీ ఆయన తనయుడు దేవినేని అవినాష్ కు మాత్రం రాజకీయాలు కలిసి రావడం లేదనే అనిపిస్తుంది. ఆయన గత కొన్ని ఎన్నికల నుంచి పోటీ చేయడం ఓటమి పాలు కావడం సాధారణంగా మారింది. దేవినేని నెహ్రూ జీవించి ఉన్న సమయంలోనే 2014లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2016 లో తన తండ్రి నెహ్రూతో కలసి దేవినేని అవినాష్ టీడీపీలో చేరారు. నాడు టిక్కెట్ దక్కకపోయినా రాష్ట్ర టీడీపీ యువత అధ్యక్షుడిగా చంద్రబాబు నాయుడు నియమించారు. 2019 ఎన్నికల్లో గుడివాడ టిక్కెట్ దక్కింది. టీడీపీ నుంచి పోటీ చేసిన దేవినేని అవినాష్ నాటి ఎన్నికల్లో కొడాలి నాని చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత ఆయన అదే ఏడాది వైసీపీలో చేరారు. దేవినేని అవినాష్ ను విజయవాడ తూర్పు నియోజకవర్గం ఇన్ ఛార్జిగా వైసీపీ అధినేత జగన్ నియమించారు. ఆ రకంగా టిక్కెట్ దక్కుతుందని ఆయన భావించారు.పెనమలూరు నుంచి... 2024 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థిగా దేవినేని అవినాష్ పేరును ప్రకటించారు.కానీ ఆ ఎన్నికల్లో దేవినేని అవినాష్ తో పాటు వైసీపీ కూడా అధికారం కోల్పోయింది. దీంతో పాటు అనేక కేసులు దేవినేని అవినాష్ పై నమోదయ్యాయి. అదే సమయంలో తూర్పు నియోజకవర్గం కంటే తనకు పెనమలూరు నియోజకవర్గం బెటర్ అని పార్టీ అధినేత జగన్ కు చెప్పినట్లు తెలిసింది. పెనమలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. తన తండ్రి దేవినేని నెహ్రూ గతంలో కంకిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేయడంతో అక్కడ తనకు బలమైన ఓటు బ్యాంకు ఉందనినమ్ముతున్నారు. మరి జగన్ పెనమలూరు విషయంలో దేవినేని అవినాష్ కోరికను తీరుస్తారా? లేదా? అన్నది చూడాలి.



# ముగ్గురే ఇండియన్స్.. కోహ్లీ, బుమ్రా లేరు: కమ్మిన్స్ ఆల్ టైమ్ ఇండియా, ఆస్ట్రేలియా కంబైన్డ్ జట్టు ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా వన్డే కెప్టెన్ పాట్ కమ్మిన్స్ అక్టోబర్ 19 నుంచి టీమిండియాతో జరగబోయే వన్డే, టీ20 సిరీస్ కు దూరమయ్యాడు. ఐపీఎల్ తర్వాత వెస్టిండీస్ తో జరిగిన టెస్ట్ సిరీస్ లో గాయపడిన ఈ ఆసీస్ కెప్టెన్ యాషెస్ ఆడడం కూడా అనుమానంగా మారింది. 2023 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ తో 2023 వన్డే వరల్డ్ కప్ ను ఆస్ట్రేలియాకు అందించిన కమ్మిన్స్ ఈ సిరీస్ లో లేకపోవడం ఆసీస్ కు మైనస్ గా మారింది.

కమ్మిన్స్ గైర్హాజరీలో వైస్ కెప్టెన్ మిచెల్ మార్ష్ ఆస్ట్రేలియా జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించనున్నాడు. ఈ సిరీస్ కు ముందు కమ్మిన్స్ ఒక ఇంటర్వ్యూలో తన ఆల్ టైం ఇండియా, ఆస్ట్రేలియా కంబైన్డ్ జట్టును ప్రకటించాడు. కమ్మిన్స్ ప్రకటించిన ప్లేయింగ్ 11 లో కేవలం ముగ్గురు మాత్రమే ఇండియన్ ప్లేయర్లు మాత్రమే ఉండడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. స్టార్ స్పోర్ట్స్ కోసం జరిగిన ప్రోమో షూట్ సందర్భంగా జరిగిన ఈ ఇంటర్వ్యూలో.. ఓపెనర్లుగా టీమిండియా దిగ్గజ బ్యాటర్ సచిన్ టెండూల్కర్ తో పాటు ఇటీవలే క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన డేవిడ్ వార్నర్ ను ఎంచుకున్నాడు. మూడో స్థానంలో ఆస్ట్రేలియా ఆల్ టైం బెస్ట్ బ్యాటర్ రికీ పాంటింగ్ ను ఎంపిక చేశాడు. నాలుగు ఐదు స్థానాల్లో ఇద్దరు ఆసీస్ ప్లేయర్లకు ఛాన్స్ ఇచ్చాడు. నాలుగు, ఐదు స్థానాలకు స్టీవ్ స్మిత్, వాట్సన్ లను ఎంచుకున్నాడు. ఫినిషర్ గా మైఖేల్ బెవాన్ ను వికెట్ కీపర్ బ్యాటర్ గా ఎంఎస్ ధోనిని తన జట్టులో చేర్చుకున్నాడు.

బౌలింగ్ లోనూ ఎక్కువగా ఆసీస్ బౌలర్లను ఎంపిక చేశాడు. స్పీడ్ స్టార్ బ్రెట్ లీతో పాటు ఆల్ టైం బెస్ట్ ఆస్ట్రేలియా పేసర్ గ్లెన్ మెగ్రాత్ కు ఛాన్స్ ఇచ్చాడు. టీమిండియాలో జహీర్ ఖాన్ కు ఎంపిక చేశాడు. ఏకైక స్పిన్నర్ గా షేన్ వార్న్ ను తన ప్లేయింగ్ 11లో చేర్చుకున్నాడు. వన్డేల్లో అద్భుతమైన గణాంకాలను కలిగిన విరాట్ కోహ్లీని కమ్మిన్స్ ఎంచుకోకపోవడం షాకింగ్ కు గురి చేసింది. ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాతో పాటు రోహిత్ శర్మను కూడా పక్కనపెట్టాడు. రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీ, స్టార్క్, గిల్ క్రిస్ట్, హేడెన్ లకు సైతం కమ్మిన్స్ జట్టులో ఛాన్స్ ఇవ్వలేదు.

**కమ్మిన్స్ ఆల్ టైమ్ ఇండియా, ఆస్ట్రేలియా కంబైన్డ్ జట్టు:**
డేవిడ్ వార్నర్, సచిన్ టెండూల్కర్, రికీ పాంటింగ్, స్టీవెన్ స్మిత్, షేన్ వాట్సన్, మైఖేల్ బెవాన్, ఎంఎస్ ధోని, షేన్ వార్న్, బ్రెట్ లీ, జహీర్ ఖాన్, గ్లెన్ మెక్‌గ్రాత్

# రిటైర్మెంట్ వార్తలకు చెక్: రెస్ట్ లేకుండానే ప్రాక్టీస్‌లో బిజీ బిజీ.. నెట్స్‌లో చెమటోడుస్తున్న కోహ్లీ



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ తో సిరీస్ ముగిసిన తర్వాత ఒక్క రోజు కూడా గ్యాప్ లేకుండా టీమిండియా ఆస్ట్రేలియా టూర్ కు బయలుదేరింది. బుధవారం (అక్టోబర్ 15) ఢిల్లీ ఎయిర్ పోర్ట్ నుంచి భారత జట్టు రెండు బ్యాచ్ లుగా ఆస్ట్రేలియా చేరుకుంది. ఉదయం వెళ్లిన బ్యాచ్‌లో సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఓపెనర్ యశస్వి జైస్వాల్, ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి, పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ ఉన్నారు. కోచ్ గౌతమ్ గంభీర్ సహా మిగిలిన ప్లేయర్లు, సపోర్ట్ స్టాఫ్?సాయంత్రం మరో బృందంగా బయల్దేరింది. ఈ నెల19న పెర్త్‌లో జరిగే తొలి వన్డేతో ఈ టూర్ మొదలవనుంది. ఆ తర్వాత అడిలైడ్, సిడ్నీలో మిగిలిన రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆస్ట్రేలియాలోకి అడుగుపెట్టిన వెంటనే స్టార్ బ్యాటర్, టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. ఒక్క రోజు రెస్ట్ లేకుండానే నెట్స్ లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ తీవ్రంగా శ్రమించాడు. ఫీల్డింగ్ లోనూ క్యాచ్ లు పడుతూ బిజీగా గడిపాడు. అన్నిటికి మించి కోహ్లీ స్లిమ్ లుక్ లో అదిరిపోయాడు. తన ఫిట్ నెస్, ఎనర్జీతో ఫ్యాన్స్ ను ఫిదా చేస్తున్నాడు. ఏడు నెలల తర్వాత కోహ్లీ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతుండడంతో ఈ మ్యాచ్ పై భారీ హైప్ నెలకొంది.

వన్డే సిరీస్ తర్వాత ఈనెల29 నుంచి ఐదు టీ20ల సిరీస్ కూడా జరగనుంది. టీ20లు, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన లెజెండ్స్ కోహ్లీ, రోహిత్ చాన్నాళ్ల తర్వాత ఇండియా జట్టు తరఫున మళ్లీ బరిలోకి దిగనుండటంతో వన్డే సిరీస్‌పై అందరిలో ఆసక్తి పెరిగింది. ఈ సిరీస్ ఇద్దరి వన్డే ఫ్యూచర్‌ను డిసైడ్ చేస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కోహ్లీ టెస్ట్, టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించడంతో ప్రస్తుతం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. 2027 వన్డే వరల్డ్ కప్ ఆడడమే తన లక్ష్యమని ఇప్పటికే పరోక్షంగా తన అభిప్రాయాన్ని తెలిపాడు.

**పోరాటం ఆగదు:**
ఇప్పటికే టెస్టు, టీ20 ఫార్మాట్లకు గుడ్ బై చెప్పిన కోహ్లీ వన్డేలకు కూడా వీడ్కోలు పలుకుతాడని.. ఆస్ట్రేలియా వన్డే సిరీసే కోహ్లీకి చివరిదని ప్రచారం జరుగుతోంది. కోహ్లీ 2027 వన్డే వరల్డ్ కప్ ఆడటం డౌటేనని వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో కోహ్లీ అభిమానులు గందరగోళానికి గురైతున్నారు.

ఇక తమ అభిమాన ఆటగాడిని గ్రౌండ్?లో చూడలేమా అని బాధపడుతున్నారు. ఈ క్రమంలో తన రిటైర్మెంట్ గురించి పుకార్లు షికార్లు చేస్తోన్న వేళ విరాట్ క్లోహీ ఇంట్రెస్టింగ్ ట్వీట్ చేశాడు. “పోరాటం ఆపాలని ఎప్పుడైతే నిర్ణయించుకుంటామో అప్పుడే మనం ఓడిపోయినట్లు” అని ఆసక్తికర ట్వీట్ చేశాడు కోహ్లీ. ఈ ట్వీట్ చూసిన కోహ్లీ అభిమానులు సంబరపడుతున్నారు.

# మ్యాచ్‌లతో అన్ని జట్లు బిజీ బిజీ: కళకళలాడుతున్న అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ లో అన్ని దేశాలు మ్యాచ్ లతో బిజీగా మారనున్నాయి. ఈ వారంలో శ్రీలంక తప్పితే అన్ని దేశాలు క్రికెట్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరోవైపు మహిళల వరల్డ్ కప్ కూడా జరుగుతుంది. ఇందులో భాగంగా మొదట న్యూజిలాండ్, ఇంగ్లాండ్ జట్లు పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడనున్నాయి. శనివారం (అక్టోబర్ 18) ఇరు జట్ల మధ్య తొలి టీ20 ప్రారంభం కానుంది. మొత్తం మూడు టీ20 మ్యాచ్ లు జరగనున్నాయి. సోమవార (అక్టోబర్ 20) రెండో టీ20.. గురువారం (అక్టోబర్ 23) వరుసగా రెండు, మూడు టీ20 మ్యాచ్ లు జరుగుతాయి. శనివారం (అక్టోబర్ 18) బంగ్లాదేశ్, వెస్టిండీస్ సిరీస్ ప్రారంభం కానుంది. మూడు వన్డే మ్యాచ్ ల కోసం వెస్టిండీస్ బంగ్లాదేశ్ లో పర్యటిస్తుంది. శనివారం తొలి వన్డే.. మంగళవారం (అక్టోబర్ 21), గురువారం (అక్టోబర్ 23) వరుసగా రెండు, మూడు వన్డే మ్యాచ్ లు జరుగుతాయి. అక్టోబర్ 27, 29, 31 వరుసగా మూడు టీ20 మ్యాచ్ లు జరుగుతాయి. పాకిస్థాన్, సౌతాఫ్రికా జట్ల మధ్య రెండు టెస్ట్ సోమవారం (అక్టోబర్ 20) నుంచి ప్రారంభమవుతుంది. అక్టోబర్ 28, 31 నవంబర్ 1 న వరుసగా మూడు టీ20 మ్యాచ్ ల సిరీస్ జరుగుతుంది. జింబాబ్వే, ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య ఏకైక టెస్ట్ అక్టోబర్ 20 నుంచి ప్రారంభం కానుంది.

**అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియా, ఇండియా సిరీస్:**
2020 తర్వాత ఇండియా తొలిసారి వైట్ బాల్ ఫార్మాట్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. అక్టోబర్ 19 నుంచి 25 వరకు వన్డే సిరీస్.. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 8 వరకు టీ20 సిరీస్ జరుగుతుంది. అక్టోబర్ 19న పెర్త్ లో తొలి వన్డేతో టూర్ మొదలవుతుంది. అక్టోబర్ 23 న అడిలైడ్ లో రెండో వన్డే.. అక్టోబర్ 25 న సిడ్నీలో మూడో వన్డే జరుగుతుంది. ఆ తర్వాత టీ20 సిరీస్ జరుగుతుంది. అక్టోబర్ 29 న మనుకా ఓవల్ లో తొలి టీ20 ప్రారంభమవుతుంది. ఆ తర్వాత మెల్‌బోర్న్, హోబర్ట్, గోల్డ్ కోస్ట్, బ్రిస్బేన్ లలో వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు టీ20 మ్యాచ్ లు ఆడాల్సి ఉంది.



# నాగ్ 100వ రాజకీయాలు.. అదిరిపోయేలా డబుల్ ట్విస్ట్!





కింగ్ అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ సినిమాను ఇటీవలే పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ‘కూలీ’, ‘కుబేర’ వంటి చిత్రాల్లో నెవ్వర్ బిఫోర్ పాత్రలతో ప్రయోగాలు చేసిన నాగ్, తన మైల్ స్టోన్ మూవీ కోసం ఒక పవర్ ఫుల్ సబ్జెక్ట్‌ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించి రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తూ అక్కినేని అభిమానుల్లో అంచనాలను పెంచుతోంది.

లేటెస్ట్ గా జానర్, నాగ్ క్యారెక్టర్, కీలకమైన నటీనటుల ఎంపికపై ఒక క్రేజీ బజ్ ఇండస్ట్రీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. లేటెస్ట్ టాక్ ప్రకారం, నాగార్జున 100వ చిత్రం ఒక హై వోల్టేజ్ పొలిటికల్ డ్రామాగా తెరకెక్కనుంది. రాజకీయ నేపథ్యం అనగానే ప్రేక్షకుల్లో ఒక రకమైన ఆసక్తి నెలకొంటుంది. దానికి తోడు, ఈ చిత్రంలో నాగార్జున ఏకంగా ద్విపాత్రాభినయం చేయబోతున్నారని టాక్. ఒకే సినిమాలో రెండు విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రల్లో కింగ్‌ను చూడటం అభిమానులకు కనుల పండుగే. కెరీర్లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించిన నాగ్, తన వందో చిత్రంలో పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో డ్యూయల్ రోల్ చేస్తున్నారనే వార్త సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ఈ పాత్రలు ఎలా ఉండబోతున్నాయి, వాటి మధ్య ఉన్న సంబంధం ఏంటి అనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంది. ఈ సినిమాలో మరో ముఖ్యమైన పాయింట్ ముఖ్యమంత్రి పాత్ర అని తెలుస్తోంది. కథలో అత్యంత కీలకంగా ఉండే ఈ పవర్‌ఫుల్ సీఎం పాత్ర కోసం మేకర్స్ ఒక స్టార్ హీరోయిన్‌ను సంప్రదిస్తున్నారని తెలుస్తోంది. ఆ పాత్రకు ఎవరు ఎంపికవుతారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉండగా, ఈ సినిమాలో మరో కీలక పాత్ర కోసం నాగార్జున ఎవర్ గ్రీన్ పెయిర్, టబును కూడా తీసుకుంటున్నారని గత కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఆమెనే సీఎం రోల్ కోసం సెలెక్ట్ చేశారా అనేది తెలియాల్సి ఉంది. దాదాపు 27 ఏళ్ల తర్వాత ‘నిన్నే పెళ్లాడతా’ కాంబో మళ్లీ తెరపైకి వస్తే, సినిమాకు అదనపు ఆకర్షణ వచ్చినట్లే. ఒకవేళ సీఎం పాత్రలో ఒక స్టార్ హీరోయిన్, మరో ముఖ్య పాత్రలో టబు ఇద్దరూ నటిస్తే, ఈ సినిమా స్టార్ కాస్టింగ్ పరంగా నెక్ట్స్ లెవెల్‌లో ఉంటుంది. ‘లాటరీ కింగ్’ అనే టైటిల్ ప్రచారంలో ఉన్నప్పటికీ, పొలిటికల్ డ్రామా కావడంతో టైటిల్‌పై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఏదేమైనా, నాగార్జున 100వ చిత్రాన్ని నిర్మాతలు భారీ బడ్జెట్‌తో, ఏమాత్రం రాజీ పడకుండా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నట్లు టాక్. పొలిటికల్ థ్రిల్లర్, డ్యూయల్ రోల్, స్టార్ హీరోయిన్ల కలయికతో ఈ సినిమా నాగార్జున కెరీర్‌లో ఒక బిగ్ హిట్ గా నిలిచే అవకాశం ఉంది. మరి ఈ వార్తలపై ఎప్పుడు క్లారిటీ ఇస్తారో చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com